# శుభోదయం!

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 360, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం - 14 - మార్చి - 2025


## నన్ను ప్రపంచబ్యాంకు జీతగాడు అన్నారు: చంద్రబాబు

### దేశంలో కరెంట్ కొరత లేని ఏకైక రాష్ట్రంగా ఏపీని తయారు చేశాం

విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చిన తొలి ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమే

1988లోనే విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చాం



అమరావతి: విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చిన తొలి ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వమేనని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 1988లో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామని... విద్యుత్ రంగాన్ని జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, ట్రాన్స్ మిషన్ గా విభజించామని చెప్పారు. ఎనర్జీ ఆడిటింగ్ ను తీసుకొచ్చామని... దేశంలో కరెంట్ కొరత లేని ఏకైక రాష్ట్రంగా ఏపీని తయారు చేశామని తెలిపారు. అసెంబ్లీలో ఇంధన శాఖపై జరిగిన చర్చలో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు వివరాలను వెల్లడించారు. వ్యవసాయానికి వినియోగించే విద్యుత్ కు ఛార్జీలను యూనిట్ చొప్పున వసూలు చేసే పరిస్థితి ఉండేదని... ఆ పరిస్థితి నుంచి శ్లాబ్ రేటుతో రైతులను ఆదుకున్నది టీడీపీ ప్రభుత్వమేనని చెప్పారు. 2014లో రాష్ట్రంలో 22.5 మిలియన్ యూనిట్ల కొరత ఉండేదని... 2014 డిసెంబర్ కు ఎక్కడా కరెంట్ కొరత లేకుండా చేశామని, 2018 నాటికి మిగులు విద్యుత్ ఉన్న రాష్ట్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇస్తున్నామని గర్వంగా చెపుతున్నానని అన్నారు. మీటర్ రీడింగ్ కోసం స్పాట్ బిల్లింగ్ తీసుకొచ్చామని తెలిపారు. తనను ప్రపంచబ్యాంకు జీతగాడు అని విమర్శలు చేశారని చెప్పారు.

---

యూనివర్సిటీల్లో తప్పు చేయాలంటేనే

## భయపడేలా చర్యలు

- అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆంధ్రా విశ్వవిద్యాలయంలో అక్రమాలపై చర్చ
- వైసీపీ హయాంలో అనేక అక్రమాలు జరిగాయన్న టీడీపీ ఎమ్మెల్యేలు
- ఏయూలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామన్న మంత్రి లోకేశ్



అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా కూటమి ప్రభుత్వ చర్యలు ఉంటాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా ఆంధ్రా విశ్వవిద్యాలయంలో అక్రమాలపై చర్చ జరిగింది. వైసీపీ హయాంలో అనేక అక్రమాలు జరిగాయని మిగతా 2లో

---



2లో

### నాగం గారూ... ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంది? సీఎం చంద్రబాబు ఆత్మీయ పలకరింపు

ఏపీ అసెంబ్లీలో చంద్రబాబును కలిసిన తెలంగాణ సీనియర్ నేత జనార్ధన్ రెడ్డి

---

## బహిష్కరణకు గురైన కుటుంబాలకు అండగా వైఎస్ జగన్

400 కుటుంబాలపై కూటమి ప్రభుత్వం బహిష్కరణ వేటు

వైఎస్ జగన్ ను కలిసిన పిన్నెల్లి గ్రామస్తులు

ధైర్యం చెప్పిన వైఎస్ జగన్

'చలో పిన్నెల్లి' కార్యక్రమానికి సిద్ధమవుతున్న వైఎస్సార్ సీపీ



తాడేపల్లి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు చేసే మంచి ఏమీ లేకపోయినా కక్ష సాధింపు చర్యలు మాత్రం తీవ్రతరమవుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలోని 400 కుటుంబాలపై బహిష్కరణ వేటు వేసింది. మిగతా 2లో

---

## 22న సమావేశానికి రావాలంటూ సీఎం రేవంత్‌కు తమిళనాడు సీఎం స్టాలిన్ ఆహ్వానం!

- తెలంగాణలోని అన్ని పార్టీలపై సమావేశం నిర్వహిస్తాం
- 'డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం స్టాలిన్ చూపించిన చొరవ అభినందనీయం
- 22వ తేదీన తమిళనాడులో జరిగే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి వెళ్లే అంశంపై ఏఐసీసీ అనుమతి తీసుకొని వెళ్తాం.



ఢిల్లీ: డీలిమిటేషన్ ప్రక్రియను ఒప్పుకునేది లేదన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఇదే సమయంలో డీలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం చూపుతుందన్నారు. ఈ విషయంలో తెలంగాణలోని మిగతా 2లో

---

### తెలంగాణలో నిర్వహించే సమ్మిట్‌కు

## బరాక్ ఒబామా...?

### ఏప్రిల్‌లో భారత్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వెల్లడి

మెట్రో రైలు హైదరాబాద్‌కు గేమ్ ఛేంజర్

గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉంది

తెలంగాణకు రావాల్సిన నిధుల గురించి కిషన్ రెడ్డి పట్టించుకోవడం లేదు



తెలంగాణ: తెలంగాణలో 'భారత్ సమ్మిట్' పేరిట ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ సమ్మిట్‌కు అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తదితరులు హాజరయ్యే అవకాశముందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏప్రిల్‌లో మూడు రోజుల పాటు నిర్మహించే ఈ సమ్మిట్‌కు అరవై దేశాల నుండి ప్రతినిధులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. విదేశాంగ శాఖ అనుమతుల కోసం కేంద్ర మంత్రి జైశంకర్‌ను కలవనున్నట్లు చెప్పారు. గవర్నర్ ప్రసంగంపై చర్చ జరుగుతున్న సమయంలో కేసీఆర్ రాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో జరిగే చర్చకు ఆయన హాజరు కావాలని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చాక నిరుద్యోగాన్ని 8.8 శాతం నుండి 6.1 శాతానికి తగ్గించామని ఆయన తెలిపారు. మిగతా 2లో

---



2

### పెరియార్పై విమర్శలు.. నిర్మలమ్మ వ్యాఖ్యలకు విజయ్ కౌంటర్

- ఏళ్లు గడిచినా ఆయన పేరు వాడకుండా ఉండలేని విధంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారు
- సమాజంలో సాంఘిక దురాచారాలు పారదోలడానికి పెరియార్ చేసిన కృషిని కొనియాడారు

---

## నేతల స్టేచర్ గురించి కాదు.. ప్రజల ఫ్యూచర్ గురించి ఆలోచించండి

రైతులను రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న బండి సంజయ్

అన్నదాతలను ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచన

ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతులు ఎందుకు మూల్యం చెల్లించాలని ప్రశ్న



హైదరాబాద్: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ విమర్శించారు. రైతు భరోసా ఇవ్వడం లేదని, రుణమాఫీ పూర్తి చేయరని, పంట నష్ట పరిహారం ఇవ్వరని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ మార్క్ రైతు సంక్షేమ మిగతా 2లో

---



2

### విమర్శల దాడి చేస్తుంటే.. తట్టుకోలేక జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారు

---



2

### బాబుగారు.. చేతులు కాలాక ఏం పట్టుకున్నా ఉపయోగం లేదు, డీ లిమిటేషన్‌పై వెంటనే స్పందించండి

---

15 నుంచి తెలంగాణ, ఏపీలో

## ఒంటిపూట బడులు

- ఒంటి పూట బడుల ఆదేశాలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు అన్నింటికీ వర్తించనున్నాయి
- పాఠశాలలు ఉదయం 8:00లకు ప్రారంభమవుతాయి, మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి
- ఉక్కపోత, వేడి గాలులకు విద్యార్థుల ఇబ్బందులు పడకుండా.. వారి సంరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడి



హైదరాబాద్/అమరావతి: వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరిగిపోతుండటంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు. మార్చి 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు ఉంటాయని ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హై స్కూల్స్ ఒకపూటే పనిచేయాల్సి ఉంటుంది. మిగతా 2లో

---


## ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవం!

మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు మాత్రమే ఉండగా, వీరిపై పోటీకి ఎవరూ సిద్ధం కాలేదు





హైదరాబాద్/అమరావతి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఎన్నికలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఏకగ్రీవంగా ముగిశాయి. నామినేషన్ల ఉపసంహరణ నాటికి తెలంగాణలోని 5 ఎమ్మెల్సీ స్థానాలకు ఐదుగురు, ఏపీలోని 5ఎమ్మెల్సీ స్థానాలకు ఐదుగురు అభ్యర్థులు మాత్రమే బరిలో ఉండటంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మిగతా 2లో

---




### రూపాయి చిహ్నం మార్చేసిన తమిళనాడు ప్రభుత్వం

రాష్ట్ర ప్రభుత్వం 2025 - 26 బడ్జెట్‌లో సాధారణ రూపాయి చిహ్నానికి బదులుగా.. తమిళ చిహ్నంతో భర్తీ



2లో

### డిమాండ్లు పాతవే.. అయినా వెల్లడించిన రష్యా..!

ఉక్రెయిన్ యుద్ధం ముగించాలన్నా.. అమెరికాతో సంబంధాలు పునరుద్ధరించాలన్నా తీర్చాల్సిన డిమాండ్ల లిస్టును రష్యా బయటపెట్టింది



2లో

### పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కన పెట్టి కలిసి రావాలి

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు ఏకగ్రీవం!

మొదటి పేజి తరువాయి



ఆయా స్థానాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్లుగా ప్రకటించారు. తెలంగాణలో కాంగ్రెస్ నుంచి అద్దంకి దయాకర్, కేతావత్ శంకర్ నాయక్, విజయశాంతి, సీపీఐ నుంచి నెల్లికంటి సత్యం, బీఆర్ఎస్ నుంచి దాసోజు శ్రవణ్ ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ, సీపీఐ మధ్య గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కుదిరిన అవగాహన మేరకు ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని సీపీఐకి కేటాయించారు. ఎమ్మెల్సీలుగా ఎన్నికైన సభ్యులకు రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి ధృవీకరణ పత్రాలు అందించారు. ఇక ఏపీలో ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీలుగా టీడీపీ నుంచి బీటీ నాయుడు, బీద రవిచంద్ర, కావలి గ్రీష్మ, జనసేన నుంచి నాగబాబు, బీజేపీ నుంచి సోము వీర్రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### 29తో ముగియ్యనున్న వారి ఎమ్మెల్సీ పదవీ కాలం

తెలంగాణలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్ పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. ఇందులో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎగ్గె మల్లేశం గత ఏడాదే కాంగ్రెస్‌లో చేరారు. మీర్జా రియాజుల్ హసన్ మజ్లిస్ నేత కాగా, మిగిలిన ముగ్గురు బీఆర్ఎస్ నేతలు. అటు ఏపీలో జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, బీటీ నాయుడు, అశోక్‌బాబు, యనమల రామకృష్ణుడుల పదవీకాలం ఈ నెల 29తో ముగియనుంది. దీంతో తెలంగాణలో ఐదు, ఏపీలో ఐదు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు.

# డిమాండ్లు పాతవే.. అయినా వెల్లడించిన రష్యా..!

ఇంటర్నెట్‌డెస్క్: ఉక్రెయిన్ యుద్ధం ముగించాలన్నా.. అమెరికాతో సంబంధాలు పునరుద్ధరించాలన్నా తీర్చాల్సిన డిమాండ్ల లిస్టును రష్యా బయటపెట్టింది. నేడు వాటిని వాషింగ్టన్‌కు అందజేసింది. కాకపోతే ఆ డిమాండ్లు ఏమిటనేది మాత్రం బయటకు వెల్లడించలేదు. గత మూడు వారాల నుంచి అమెరికా-రష్యా అధికారులు వర్చువల్ విధానంలో చర్చలు జరుపుతున్నారు. కాకపోతే మాస్కో పంపిన డిమాండ్లలో చాలావరకు గతంలో ఉక్రెయిన్‌కు అందించినవే ఉన్నట్లు తెలుస్తోంది. వీటిల్లో కీవ్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకపోవడం, విదేశీ దళాలను ఉక్రెయిన్‌లోకి అనుమతించకపోవడం, క్రిమియా, మరో నాలుగు ప్రావిన్స్‌లు రష్యాకు చెందుతాయని అంగీకరించడం వంటివి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతోపాటు అసలు యుద్ధానికి మూలకారణమైన నాటో తూర్పువైపు విస్తరణ అంశం కూడా పరిశీలించాలని కోరే అవకాశం ఉంది. మరోవైపు 30 రోజుల కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా రష్యా ప్రతిస్పందన కోసం వేచి చూస్తున్నారు. ఇప్పటికే యుద్ధం ఆపడంలో తొలి అడుగుగా.. జెలెన్‌స్కీ ఈ డిమాండ్‌ను ఆమోదించిన విషయం తెలిసిందే. కాకపోతే పుతిన్ నుంచి మాత్రం ఎటువంటి సంకేతాలు వెలువడలేదు. ఈ చర్చలను అడ్డంపెట్టుకొని అమెరికా-ఉక్రెయిన్-ఐరోపాను వేరు చేయడానికి రష్యా అధ్యక్షుడు ప్రయత్నిస్తారనే భయాలు వాషింగ్టన్ బృందంలో ఉన్నాయి. మరోవైపు తమ డిమాండ్ల విషయంలో వాషింగ్టన్‌లోని రష్యా దౌత్య కార్యాలయం స్పందించేందుకు నిరాకరించింది. తాజాగా ఈ అంశంపై బ్రూకింగ్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఏంజెలా స్టెంట్ మాట్లాడుతూ డిమాండ్లలో ఎటువంటి మినహాయింపులు ఇచ్చేందుకు రష్యన్లు సిద్ధంగా లేనట్లు కనిపిస్తోందన్నారు. గతంలో పలుమార్లు అమెరికా తిరస్కరించిన డిమాండ్లనే మళ్లీ చేస్తోంది. దీంతో మాస్కో శాంతి, అర్థవంతమైన చర్చలకు ఆసక్తిగా లేదని తెలుస్తోందన్నారు.

## రూపాయి చిహ్నం మార్చేసిన తమిళనాడు ప్రభుత్వం

తమిళనాడు: జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు - కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం జరుగుతోంది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం 2025 - 26 బడ్జెట్‌లో సాధారణ రూపాయి చిహ్నానికి బదులుగా.. తమిళ చిహ్నంతో భర్తీ చేసింది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొత్త జాతీయ విద్యా విధానం ద్వారా 'హిందీ విధించడం'పై బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో.. అధికార డీఎంకే పోరాటం చేస్తున్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రూపాయి చిహ్నం మార్చేసింది. ఈ మార్పుపై ఇప్పటివరకు తమిళనాడు ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం రాలేదు. తమిళనాడు చర్య భారతదేశంలో ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా ఉందని బీజేపీ ప్రతినిధి అన్నారు. అంతే కాకుండా తమిళంలో చదవడం, రాయడం వచ్చి ఉంటేనే.. తమిళనాడులో ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయని, మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ కీలక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. "హిందీ, సంస్కృత ఆధిపత్యం కారణంగా ఉత్తర భారతదేశంలో 25 కంటే ఎక్కువ స్థానిక భాషలు కనుమరుగయ్యాయి. శతాబ్దాల నాటి ద్రవిడ ఉద్యమం అవగాహన, నిరసనల ద్వారా తమిళం.. దాని సంస్కృతిని రక్షించింది" అని ఆయన అన్నారు.

## పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కన పెట్టి కలిసి రావాలి

ఢిల్లీ: ప్రశ్నాపత్రాల లీకేజీలను వ్యవస్థాగత వైఫల్యంగా కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. మరోసారి మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. గురువారం ఆయన ఎక్స్ వేదికగా.. లీక్‌ల కారణంగా కష్టపడి చదివే ఎంతో మంది విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని.. దీనిపై పోరాడేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కన పెట్టి కలిసి రావాలంటూ పిలుపునిచ్చారు. 'ప్రశ్నాపత్రాల లీకులతో ఆరు రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రమాదంలో పడిందన్న రాహుల్.. వీటి కారణంగా కష్టపడి చదివే విద్యార్థులతో పాటు వారి కుటుంబాలు కూడా ఒత్తిడికి గురవుతున్నాయన్నారు. వారి కష్టానికి తగిన ఫలితం అందడం లేదన్నారు. దీంతో కష్టపడి పనిచేయడం కంటే నిజాయితీగా లేకపోవడమే మంచిదనే తప్పుడు సంకేతాలు భవిష్యత్ తరాలకు వెళ్తుందంటూ అభిప్రాయవ్యక్తం చేసిన రాహుల్.. ఇది ఆమోదయోగ్యం కాదన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం లీకులను అడ్డుకోలేకపోయింది. ఇది వారి వైఫల్యానికి నిదర్శనం. అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు విభేదాలు పక్కనబెట్టి దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే వీటిని అరికట్టగలం. ఈ పరీక్షలు మన పిల్లల హక్కు. దాన్ని ఎలాగైనా రక్షించాలి' అంటూ రాహుల్ ట్వీట్ చేశారు.

## బాబుగారు.. చేతులు కాలాక ఏం పట్టుకున్నా ఉపయోగం లేదు, డీ లిమిటేషన్‌పై వెంటనే స్పందించండి

అమరావతి:: డీ లిమిటేషన్ ద్వారా సౌత్ స్టేట్స్ పై నిజంగా బీజేపీది ప్రతికారమే అని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో తన ప్రభావం లేనందుకే ఈ కక్ష్య సాధింపు చర్యని బీజేపీపై మండిపడ్డారు. పార్లమెంట్ లో సౌత్ ప్రాతినిథ్యం తగ్గించే కుట్రలో భాగమే అని ఆరోపించారు షర్మిల. కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు అక్షర సత్యం అన్నారు. జనాభా ప్రాతిపదికన డీ లిమిటేషన్ చేయడం అంటే.. కుటుంబ నియంత్రణ పాటిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నట్లే అని షర్మిల వ్యాఖ్యానించారు. '1971 తర్వాత సౌత్ కంటే నార్త్ లోనే అత్యధిక జనాభా పెరిగింది. ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రాన్ని ఉదాహరణగా తీసుకుంటే 8 కోట్ల నుంచి 24 కోట్ల జనాభా పెరిగింది. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం యూపీలో 80 నుంచి 143 సీట్లకు అదనంగా పెరుగుతున్నట్లే. బీహార్ లో 40 నుంచి 79 కి పెరిగే స్థానాలు కలుపుకుంటే.. రెండు రాష్ట్రాల నుంచే 222 ఎంపీలు పార్లమెంట్ లో ప్రాతినిథ్యం వహించే పరిస్థితి. ఇదే సమయంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం పెరిగే సీట్లు 12 మాత్రమే. అంటే 42 నుంచి 54కి మాత్రమే. సౌత్ రాష్ట్రాల్లో పెరిగే సీట్లు పదుల సంఖ్యలో ఉంటే, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆ సంఖ్య వందలాదిగా ఉంటోంది. డీ లిమిటేషన్ పై బీజేపీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా అఖిలపక్షం ఏర్పాటు చేయాలి. డీ లిమిటేషన్ పై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు స్పందించకపోవడం తగదు. దాటవేసే ధోరణి అవలభించడం అన్యాయం. బీజేపీతో కూటమి పొత్తులో ఉన్నారని మౌనం వహిస్తే.. చేతులు కాలాక ఏం పట్టుకున్నా ఉపయోగం లేదని చంద్రబాబు గ్రహించాలి. డీ లిమిటేషన్ పై మీ వైఖరి వెంటనే చెప్పాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం' అని షర్మిల అన్నారు.

## పెరియార్పై విమర్శలు.. నిర్మలమ్మ వ్యాఖ్యలకు విజయ్ కౌంటర్

-హైదరాబాద్ : ప్రముఖ సంఘసంస్కర్త పెరియార్పై కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ చేసిన విమర్శలను తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ తీవ్రంగా ఖండించారు. ఏళ్లు గడిచినా ఆయన పేరు వాడకుండా ఉండలేని విధంగా ప్రజల మనసుల్లో నిలిచిపోయారని కౌంటర్ ఇచ్చారు. తమిళాన్ని అవమానించిన వ్యక్తికి పూలమాలలు వేస్తున్నారంటూ ఈవీకే పెరియార్ను పరోక్షంగా ప్రసావిస్తూ రాజ్యసభలో సీతారామన్ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆమె వ్యాఖ్యలపై స్పందించిన విజయ్.. సమాజంలో సాంఘిక దురాచారాలు పారదోలడానికి పెరియార్ చేసిన కృషిని కొనియాడారు. "బాల్య వివాహాలను వ్యతిరేకించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. కులం పేరిట జరిగిన అకృత్యాలను ఖండించారు. ఇలా మనం ఆయన గురించి చెప్తూపోవచ్చు. సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు ఉండాలని మనం ఇప్పుడు మాట్లాడుతున్న మాటలను ఆయన వందసంవత్సరాల క్రితమే పిలుపునిచ్చి ప్రజల మనసులో చెరగని ముద్ర వేసుకున్నారు. పెరియార్ తమిళ భాషను అవమానించినందుకు కేంద్రమంత్రి నిజంగానే బాధపడ్డారా..? మీరు నిజంగా బాధపడి ఉంటే.. త్రిభాషా సూత్రాన్ని మాపై రుద్దడం ఆపేస్తారా..? పెరియార్ గురించి ఎవరైనా అవమానకర వ్యాఖ్యలు చేస్తే.. అవి వివాదాస్పదం అవుతుంటాయి. తమిళనాడు ప్రజల మనసులో ఆయన ఎలా నిలిచి ఉన్నారో, ఆయన్ను ఎలా గౌరవిస్తున్నారో ఈ ఒక్క ఉదాహరణ చాలు" అని విజయ్ అన్నారు. ఎన్‌ఈపీ-2020లోని కీలక అంశాలను, ముఖ్యంగా త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి నిరాకరించిన కారణంగా కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) కింద అందించాల్సిన రూ.573 కోట్లను నిలిపేసింది. ఎన్‌ఈపీ మార్గదర్శకాలు అమలు పరిస్తేనే కేంద్రం తన వాటా నిధులు అందిస్తుందని విధాన నిబంధనలు చెబుతున్నాయి. ఇలా కేంద్రం, తమిళనాడు మధ్య వివాదం నడుస్తోన్న వేళ.. నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు విమర్శలు దారితీశాయి.

మొదటి పేజి తరువాయి

రాష్ట్రానికి రూ. 2.2 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకు వచ్చామని అన్నారు. పన్ను వసూళ్లలో తెలంగాణ ముందంజలో ఉందని రేవంత్ రెడ్డి అన్నారు.

నేనెవరో తెలియకుండానే ముఖ్యమంత్రిగా చేశారా?

గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందని ఆయన చెప్పారు వారితో ఫొటోలు దిగి చూపించుకోవాల్సిన అవసరం తనకు లేదని ముఖ్యమంత్రి తెలిపారు. నేను ఎవరో తెలియకుండా తనను పీసీసీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రిగా చేశారా? అని ప్రశ్నించారు. తాను ఎవరి ట్రాప్‌లో పడనని పేర్కొన్నారు.


తమిళనాడు కంటే ముందే మన వద్ద సమావేశం

లోక్ సభ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అనేది దక్షిణాదికి సీట్ల విషయంలో నష్టం చేసేదని అన్నారు. ఈ అంశంపై అఖిల పక్ష సమావేశానికి మల్లు భట్టివిక్రమార్క, జానారెడ్డి నేతృత్వంలో కమిటీని వేసినట్లు చెప్పారు. తమిళనాడులో సమావేశం కంటే ముందే మన రాష్ట్రంలో అఖిల పక్ష సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అందరి అభిప్రాయ సేకరణ తర్వాతే డీఎంకే సమావేశంపై తమ వైఖరి చెబుతామని అన్నారు.

తెలంగాణకు రావాల్సిన వాటిని కిషన్ రెడ్డి పట్టించుకోవడం లేదు

రాష్ట్రానికి సంబంధించిన అంశాలు సాధించుకు రావాలని తాను

# తెలంగాణలో నిర్వహించే సమ్మిట్‌కు బరాక్ ఒబామా...?



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరుతున్నానని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన వాటి గురించి కిషన్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు ఇచ్చిన హామీల గురించి అడుగుతున్నామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, కేంద్ర ప్రాజెక్టులు ఇవ్వాలని అడుగుతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

మెట్రో హైదరాబాద్‌కు గేమ్ ఛేంజర్

మెట్రోకు కేంద్ర మంత్రివర్గం అనుమతిస్తే పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మెట్రో విస్తరణ హైదరాబాద్ కు గేమ్ ఛేంజర్ అని రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో తమిళనాడులో మెట్రో ప్రకటనలో నిర్మలా సీతారామన్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. మామునూరు ఎయిర్ పోర్టుకు 253 ఎకరాల భూసేకరణ పూర్తి చేశామని తెలిపారు. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే సరిపోతుందని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్లు రాని వారికి అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తామని హామీ ఇచ్చామని, అందుకే పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన వారికి కార్పొరేషన్ పదవులు ఇచ్చామని గుర్తు చేశారు. అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌కు ఎమ్మెల్సీలు ఇచ్చామని వెల్లడించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పదేళ్ల కాలంలో ఒక్క కొత్త పాలసీని కూడా తీసుకురాలేదని ఆరోపించారు.

# విమర్శల దాడి చేస్తుంటే.. తట్టుకోలేక జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారు : కేటీఆర్



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాగ్దానాల భంగంపై విమర్శల దాడి చేస్తుంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం తట్టుకోలేక బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు మండిపడ్డారు. జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'పేరుకేమో ప్రజాపాలన, ప్రజా ప్రభుత్వం అంటున్నారు. మేం ప్రజాస్వామికంగా ఉన్నామని చెప్పి.. తెల్లారిస్తే పాడిందే పాటలా.. అరిగిపోయిన గ్రామ్‌ఫోన్ రికార్డులా.. ముఖ్యమంత్రి నుంచి మంత్రుల దాకా అందరూ ఒకేమాట ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన అని చెబుతున్నారు. కానీ, నిన్న గవర్నర్ ఉభయసభల నుంచి ఉద్దేశించి చేసిన ప్రసంగంపై, అందులోని డొల్లతనంపై, చెప్పిన పసలేని విషయాలు, పచ్చిఅబద్ధాలపై మా పార్టీ తరఫున శాసనసభలో మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు జగదీశ్‌రెడ్డి మాట్లాడం మొదలుపెట్టి పది నిమిషాలు కాకముందే ఆరు నిమిషాల్లోపే ఉద్దేశపూర్వకంగా అటు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రన్నింగ్ కామెంట్రీ చేస్తూ, ఆయన ప్రసంగానికి అంతరాయం కలిగిస్తూ ఇష్టం వచ్చిన కామెంట్స్ చేశారు' అన్నారు.

ప్రజల తరఫున ప్రభుత్వాన్ని హెచ్చరించారు..

'జగదీశ్‌రెడ్డి ఏమాత్రం సంయమనం కోల్పోకుండా.. రాష్ట్రంలో ఎండిపోతున్న పంటలు, రాష్ట్రంలో అధోగతి పాలైన వ్యవసాయం, రైతుల కష్టాలు, జరగని రుణమాఫీ, పడని రైతుబంధుపై ఎండగట్టారు. తన పద్ధతుల్లో చాలా స్పష్టంగా ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల తరఫున ఓ హెచ్చరిక చేశారు. అమలుకాని ఆరు గ్యారంటీలు, ఇచ్చిన 420 హామీల వాగ్దానాల భంగంపై విమర్శలతో దాడి చేస్తుంటే.. తట్టుకోలేని ప్రభుత్వం.. నీతిబాహ్యంగా, నిస్సిగ్గుగా ఇవాళ కేవలం అబద్ధాలపై ఆధారపడే బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డిని అనని మాటను అన్నట్లుగా చిత్రీకరించి సస్పెండ్ చేసే ప్రయత్నం చేశారు. జగదీశ్‌రెడ్డి ఒక్కమాట అన్‌పార్లమెంటరీ మాట సభలో మాట్లాడలేదు. అన్నదీ ఒక్కటే మాట.. స్పీకర్ గారు మాకు అందరికీ తండ్రిలాంటి వారు.. మీరు మా అందరి తరఫున అక్కడ ఉన్నారు.. మా అందరి మా హక్కులు మీరే కాపాడాలని ఆక్రోషం వ్యక్తం చేశారు. ఎక్కడ కనీసం ఒక్కమాట కూడా స్పీకర్‌ను అగౌరవంగా, పొరపాటున అనలేదు. కానీ, అనని మాటను అన్నట్లుగా.. జరగని తప్పును జరిగినట్లుగా చిత్రీకరించి మా గౌరవ సభ్యుడిని ఈ సమావేశాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేస్తున్నామని.. ఏకపక్షంగా, నియంతృత్వ పోకడలతో రాష్ట్ర ప్రభుత్వం ఐదుగంటలు సభను వాయిదా వేసింది.. ఢిల్లీలో ఉన్న రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు గొంతునొక్కారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వివరణ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వలేదు..

'మాకు కనీసం అవకాశం ఇవ్వలేదు. ఉరిశిక్ష వేసేముందు కూడా ఖైదీలకు తమ వాదన చెప్పుకునేందుకు అవకాశం కల్పిస్తారు. కానీ, జగదీశ్‌రెడ్డికి తాను చేసిన తప్పేంది.. నేను మాట్లాడిన తప్పు ఏంటీ? అనే వివరణ అడిగేందుకు అవకాశం ఇవ్వలేదు. మా నాయకుడు, తెలంగాణ సాధకుడు కేసీఆర్ మాకు స్పష్టంగా అవకాశం ఇచ్చారు. స్పీకర్ పెద్దవారు. ఆయన బాధపడి ఉంటే.. ఏం పర్వాలేదు విచారం వ్యక్తం చేయండని చెప్పారు. సభ సజావుగా జరిగేటట్టు సహకరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ మాటను స్పీకర్, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుకు స్పష్టంగా చెప్పాం. మాకు మైక్ ఇవ్వండి.. మేం నిజంగానే మేం పొల్లు మాట మాట్లాడి ఉంటే.. టీవీ పెట్టి శాసనసభలో చూపెట్టండి.. సభ్యులందరికీ చూపించండి.. అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. ఇలాంటి ప్రతిష్టంభన ఏర్పడ్డప్పుడు.. మూడ్ ఆఫ్ ది హౌస్ తీసుకుంటారు, అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకుంటారు' అని తెలిపారు.

### మా గొంతు నొక్కారు..

'అవసరమైతే అన్ని స్పీకర్ చాంబర్‌లో ఒక సమావేశం పెట్టి ప్రతిష్టంభన తొలగించేందుకు ప్రయత్నం చేస్తారు. ఒకవేళ ఏదైనా మాట దొర్లిందని మీరు భావిస్తే మా సభ్యులు హుందాగా ముందుకు వచ్చి విచారం వ్యక్తం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మేం తప్పు చేయలేదు. ఒక్క పొల్లుమాట మాట్లాడలేదు. అయినా సరే.. స్పీకర్‌పై ఉండే గౌరవంతో.. ఆ పదవిపై ఉండే గౌరవంతో మేం అవసరమైతే విచారం వ్యక్తం చేసి.. సభ సజావుగా జరిగేందుకు సహకరిస్తామని స్పీకర్, మంత్రికి చెప్పాం. కానీ, చేయని తప్పుకు మొత్తం సెషన్ అంతా జగదీశ్‌రెడ్డిని సస్పెండ్ చేశారు. హరీశ్‌రావు రిపీటెడ్‌గా అడుగుతున్నారు. మా పార్టీ తరఫున మా వాదన చెప్పనివ్వాలని.. చెప్పేది వినండి అన్నా వినకుండా.. కాంగ్రెస్ పార్టీ సభ్యులు నలుగైదుగురితో మాట్లాడించారు. వారు చెప్పిందే వేదమని.. చెప్పిందే సత్యం అన్నట్లు బుల్డోజ్ ధోరణితో.. నియంతృత్వ పోకడలతో ఈ రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం రేవంత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయం తీసుకొని మా సభ్యుడి గొంతునొక్కారు' అంటూ కేటీఆర్ మండిపడ్డారు.

# బహిష్కరణకు గురైన కుటుంబాలకు అండగా వైఎస్ జగన్

మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభుత్వం రాగానే పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలోని 400 కుటుంబాలపై బహిష్కరణ వేటు వేసింది. బహిష్కరణకు గురైన వారంతా ఎస్సీ, బీసీ, మైనార్టీలే. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురజాల నియోజకవర్గం మాచవరం మండలం పిన్నెల్లి గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. బహిష్కరణకు గురైన పిన్నెల్లి గ్రామంలోని కుటుంబాలకు అండగా నిలిచారు వైఎస్ జగన్ ఈ క్రమంలోనే అవసరమైన న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు వైఎస్ జగన్. గ్రామంలోకి వస్తే తమను చంపుతామని బెదిరిస్తున్నారని వారు వైఎస్ జగన్‌కు విన్నవించుకున్నారు. వీరికి వైఎస్ జగన్ ధైర్యం చెప్పారు. దీనిలో భాగంగా 'చలో పిన్నెల్లి' కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ' సిద్ధమైంది. రెండు నెలల్లో చలో పిన్నెల్లి' కార్యక్రమం చేపట్టాలని వైఎస్సార్‌సీపీ' నిర్ణయించింది. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహా పిన్నెల్లి, తురకపాలెం, మాదెనపాడు, చెన్నాయపాలెం గ్రామస్తులున్నారు.

# యూనివర్సిటీల్లో తప్పు చేయాలంటేనే భయపడేలా చర్యలు

మొదటి పేజి తరువాయి

వైసీపీ హయాంలో అనేక అక్రమాలు జరిగాయని టీడీపీ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ అంశంపై మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ఆంధ్రా యూనివర్సిటీలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామని అన్నారు. ఇన్‌ఛార్జ్ వీసీ ఇప్పటికే విచారణకు ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ విచారణ నివేదిక అందిన వెంటనే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ.. గతంలో ఏయూ వీసీగా పనిచేసిన ప్రసాదరెడ్డి వైసీపీ అధ్యక్షుడి తరహాలో వ్యవహరించారని మండిపడ్డారు. ఎంతో పేరున్న ఆంధ్రా విశ్వవిద్యాలయాన్ని రాజకీయ వేదికగా ఆయన మార్చేశారని ఆరోపించారు. ఏపీలోని ఇతర వర్సిటీల ప్రక్షాళన కూడా జరగాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కోరారు. ఏయూ విషయంలో నిర్దిష్ట కాలంలో విచారణ జరగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పేర్కొన్నారు.

### 15 నుంచి తెలంగాణ, ఏపీలో

# ఒంటిపూట బడులు

మొదటి పేజి తరువాయి

రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హై స్కూల్స్ ఒకపూటే పనిచేయాల్సి ఉంటుంది. ఒంటి పూట బడుల ఆదేశాలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు అన్నింటికీ వర్తించనున్నాయి. ఒంటిపూట బడుల సమయంలో పాఠశాలలు ఉదయం 8:00లకు ప్రారంభమవుతాయి, మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. ఉక్కపోత, వేడి గాలులకు విద్యార్థుల ఇబ్బందులు పడకుండా.. వారి సంరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒంటిపూట బడులు మార్చి 15 నుంచి ఏప్రిల్ 23 వరకు నిర్వహించనున్నారు. ఆ తర్వాత వేసవి సెలవులు ఇవ్వనున్నారు. తిరిగి జూన్ 12 నుంచి 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే వేసవి ప్రతాపం అధికంగా ఉంటోంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణం కంటే 4-5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఇక వడగాలులు ఈ నెల మూడో వారం నుంచి ప్రతాపం చూపించనున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరిగిపోతుండటంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించాలని అధికారులు నిర్ణయానికి వచ్చారు. మార్చి 15వ తేదీ నుంచి ఒంటి పూట బడులు ఉంటాయని బుధవారం ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హై స్కూల్స్ ఒకపూటే పనిచేయాల్సి ఉంటుంది. ఒంటి పూట బడుల ఆదేశాలు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు అన్నింటికీ వర్తించనున్నాయి. ఒంటిపూట బడుల సమయంలో పాఠశాలలు ఉదయం 8:00లకు ప్రారంభమవుతాయి, మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. ఉక్కపోత, వేడి గాలులకు విద్యార్థుల ఇబ్బందులు పడకుండా.. వారి సంరక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒంటిపూట బడులు మార్చి 15 నుంచి ఏప్రిల్ 23 వరకు నిర్వహించనున్నారు. ఆ తర్వాత వేసవి సెలవులు ఇవ్వనున్నారు. తిరిగి జూన్ 12 నుంచి 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల వారి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే వేసవి ప్రతాపం అధికంగా ఉంటోంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాధారణం కంటే 4-5 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఇక వడగాలులు ఈ నెల మూడో వారం నుంచి ప్రతాపం చూపించనున్నాయి.

# 22న సమావేశానికి రావాలంటూ సీఎం రేవంత్‌కు తమిళనాడు సీఎం స్టాలిన్ ఆహ్వానం!

మొదటి పేజి తరువాయి

ఈ విషయంలో తెలంగాణలోని అన్ని పార్టీలపై సమావేశం నిర్వహిస్తామని రేవంత్ చెప్పుకొచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో ఉన్నారు. ఈ క్రమంలో డీలిమిటేషన్‌పై మార్చి 22న తమిళనాడు ప్రభుత్వ నిర్వహించే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డీఎంకే నేతలు, ఎంపీలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ..'డీలిమిటేషన్‌పై తమిళనాడు సీఎం స్టాలిన్ చూపించిన చొరవ అభినందనీయం. 22వ తేదీన తమిళనాడులో జరిగే జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి వెళ్లే అంశంపై ఏఐసీసీ అనుమతి తీసుకొని వెళ్తాం. డీలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాలపై ప్రభావం చూపుతుంది. డీలిమిటేషన్ లిమిట్ ఫర్ సౌత్ లాగా ఉంది. డీలిమిటేషన్ ప్రక్రియను ఒప్పుకునేదే లేదు. ఉత్తరాది రాష్ట్రాల కన్నా దక్షిణాది రాష్ట్రాలు అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో డీలిమిటేషన్‌పై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. దీనికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి కూడా రావాలని కోరుతున్నాం. డీలిమిటేషన్‌పై కిషన్ రెడ్డి తన గళం కేంద్ర క్యాబినెట్‌లో వినిపించాలి. తెలంగాణలోని అన్ని పార్టీలపై సమావేశం నిర్వహిస్తాం' అని చెప్పుకొచ్చారు.

# నేతల స్టేచర్ గురించి కాదు.. ప్రజల ఫ్యూచర్ గురించి ఆలోచించండి

మొదటి పేజి తరువాయి

రైతు భరోసా ఇవ్వడం లేదని, రుణమాఫీ పూర్తి చేయరని, పంట నష్ట పరిహారం ఇవ్వరని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ మార్క్ రైతు సంక్షేమ రాజ్యమంటే ఇదేనా? అని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల స్టేచర్ గురించి కాకుండా... రైతుల ఫ్యూచర్ గురించి ఆలోచించాలని అన్నారు. అసెంబ్లీలో రైతు సమస్యలపై చర్చించాలని బండి సంజయ్ సూచించారు. కష్టాల్లో ఉన్న అన్నదాతలను ఆదుకోవాలని... యాసంగి పూర్తయ్యేంత వరకు నీళ్లు వదలాలని కోరారు. కాలువల్లో నీళ్లున్నా ఎందుకు వదలడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతులు ఎందుకు మూల్యం చెల్లించాలని ప్రశ్నించారు. 10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నా ప్రభుత్వానికి అన్నదాతల ఆక్రందనలు వినిపించడం లేదని సంజయ్ మండిపడ్డారు. ప్రతి విషయాన్ని కేంద్ర ప్రభుత్వంపై నెట్టేసి రేవంత్ ప్రభుత్వం తప్పించుకోవాలనుకుంటోందని విమర్శించారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని అన్నారు.

# నాగం గారూ... ఎలా ఉన్నారు? ఆరోగ్యం ఎలా ఉంది? సీఎం చంద్రబాబు ఆత్మీయ పలకరింపు



అమరావతి: తెలుగుదేశం పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేసిన సీనియర్ నేత, మాజీ మంత్రి నాగం జనార్ధన్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును అసెంబ్లీలో కలిశారు. చాలాకాలం తరువాత తనను కలిసిన నాగంను సీఎం చంద్రబాబు ఆప్యాయంగా పలకరించారు. నాగం గారూ... ఎలా ఉన్నారు... ఆరోగ్యం ఎలా ఉంది... చాలా రోజులు అయ్యింది కలిసి అంటూ ఆత్మీయంగా పలకరించారు. పిల్లలు ఏం చేస్తున్నారు అని ఆరా తీశారు. నాగం కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్న చంద్రబాబు... ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయనకు సూచించారు. ఓబులాపురం మైనింగ్ అంశంలో ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం నేతలు చేసిన ఉద్యమాలపై నాడు కేసులు నమోదు అయ్యాయి. ఆ కేసుల విచారణలో భాగంగా విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టుకు నాగం జనార్ధన్ రెడ్డి గురువారం హాజరయ్యారు. ఆనాటి కేసులను ఎట్టకేలకు కొట్టివేయడంపై చంద్రబాబు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ రెడ్డి అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు పాత ఘటనలను గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నాడు చేసిన ప్రజా పోరాటాల గురించి చర్చించుకున్నారు. నాగం ఫైర్ బ్రాండ్‌గా ఉండేవారని... పార్టీ ఆదేశిస్తే దూసుకుపోయేవాళ్లని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎంతో ఎమోషన్‌గా ఉండేవారంటూ నాటి ఘటనలను ప్రస్తావించారు. నాలుగవసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని నాగం వ్యాఖ్యానించారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలి... తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో విజయాలు సాధించాలనేదే తన అభిమతమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

## సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలి.. పే స్కేల్ ఇవ్వాలి..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (స్టాఫ్ రిపోర్టర్) (కొమ్ము శ్రీనివాసరావు) మర్చి.13..(శుభోదయం న్యూస్) సామాజిక సేవలో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు బోధన అందిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేసి. పే స్కేల్ అమలు చేయాలని. రాష్ట్ర (ఐ ఈ .ఆర్ .పి) ల సంఘం. అధ్యక్ష. ప్రధాన కార్యదర్శులు. రాఘవేంద్రరావు. మారి పల్లి రమేష్. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2023బి24. సంవత్సరాల లెక్కల ప్రకారం 81000 మంది దివ్యాంగ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో నమోదై ఉన్నారని. వారికి బోధన అందిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలకతీర్పు ఇటీవల ఇచ్చిందని. అ ట్టి సుప్రీంకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం విద్యా శాఖ నందు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక ఉపాధ్యాయులైన.( ఐ ఈ ఆర్ పి) లు 790 మంది గత 19 సంవత్సరాలుగా దివ్యాంగ పిల్లలకు విద్యాబోధన అందిస్తూ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని. వారు చెప్పారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తేదీ .07-03-2025. రోజున ఇచ్చిన తీర్పు ప్రకారం భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో దివ్యాంగ పిల్లలకు విద్య బోధన అందిస్తు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న రోజువారి వేతనం కింద పని చేస్తున్న. ప్రత్యేక ఉపాధ్యాయులను వారి యొక్క సర్వీసును పరిగణంలోకి తీసుకొని. వారికి . పే స్కేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును వెలువరించడం జరిగింది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము నందు ప్రస్తుతం 790 మంది ప్రత్యేక ఉపాధ్యాయులైన (ఐఇఆర్పి) లు గత 19 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తూ దివ్యాంగు పిల్లలకు విద్యాబోధన అందించడం జరుగుతుందని సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మహారాష్ట్ర నందు 3100 మందిని. మణిపూర్ రాష్ట్రంలో 272. నందిని. హర్యానా రాష్ట్రంలో 146 మందిని కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులను క్రమబద్ధీకరణ చేయడం జరిగిందని వారు తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న (ఐ ఈ ఆర్ పి)లు ప్రత్యేక విద్యకు సంబంధించి విద్యా అర్హతలు కలిగి ఉండి. రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చేత గుర్తింపబడిన. సర్టిఫికెట్ కలిగి ఉండి. నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష నిర్వహించి రోస్టర్ కం రిజర్వేషన్ పద్ధతుల్లో నిర్వహించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం 20 20-21. విద్యా సంవత్సరం లెక్కల ప్రకారం. జీవో ఎంఎస్. నెంబర్/97 ప్రకారం 18500 మంది దివ్యాంగ పిల్లల సంఖ్య ప్రకారం 1523 పోస్టులు. ప్రాథమిక స్థాయిలో 796 పోస్టులు. (ఎస్ జి టి) పోస్టులు ఉన్నత స్థాయిలో 727 పోస్టులు విడుదల చేయడం జరిగిందన్నారు. ఇందులో ప్రమోషన్ల కోసం 516 పోస్టులను పక్కకు పెట్టడం జరిగిందన్నారు. అందులో ప్రమోషన్ కి ఎలిజిబుల్ అయిన ప్రత్యేక ఉపాధ్యాయులు (ఎస్ జి టి) లు వల్ల 384 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అదేవిధంగా నోటిఫికేషన్ ఇచ్చిన 796 (ఎస్ టి జి) పోస్టులలో 277 ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే నోటిఫికేషన్ ఇచ్చిన 220 స్కూల్ అసిస్టెంట్ పోస్టులలో 30 ఖాళీగా మిగిలిన అన్నారు. మొత్తం 670 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గత 19 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో నమోదైన దివ్యాంగుల పిల్లలకు విద్యా బోధన అందిస్తు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులైన (ఐఇఆర్పి) ల సర్వీసును పరిగణలోకి తీసుకొని సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పును అనుసరించి పే స్కేలు అమలు చేయాలని. తెలంగాణ రాష్ట్ర(ఐఇఆర్పి)ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు. రాఘవేందర్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారేపల్లి రమేష్. సుమలత. పద్మావతి. తదితర సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.

## వివో ఏలు నడుం బిగించాలి
## మానవ అక్రమ రవాణా పై అవగాహన సదస్సు....

సంగెం: (శుభోదయం న్యూస్) : మహిళలు మానవ అక్రమ రవాణా పట్ల అవగాహనతో కూడిన అప్రమత్తత కలిగి ఉండాలని సంగెం ఎస్సై నరేష్ తెలిపారు .శాంతి మండల సమాఖ్య ఆఫీసులో వివోఏ లకు,వివో అధ్యక్షులకు మానవ అక్రమ రవాణా పై ఏర్పాటుచేసిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన చుట్టూ ఉండే మోసపూరిత మనుషులే అమాయక ప్రజలను టార్గెట్ చేసి బాండెడ్ లేబర్ గా, సెక్స్ వర్కర్ గా మారుస్తున్నారని తెలిపారు. ప్రజల పేదరికాన్ని ఆసరా చేసుకొని, అమాయకపు నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళలను,బాలబాలికలకు ఉద్యోగ అవకాశాల పేరుతో డబ్బు ఆశ చూపి సెక్స్ వర్కర్లుగా,బాండెడ్ లేబర్లుగా వివిధ మెట్రోపాలిటన్ నగరాలలో అమ్ముతున్నారని తెలిపారు. అభంశుభం తెలియని చిన్నారులను సైతం కిడ్నాప్ చేసి భిక్షాటన కోసం, అవయవాల మార్పిడి కోసం, లైంగిక వాంఛ తీర్చుకోవడం కోసం, మానవ అక్రమ రవాణా కు పాల్పడుతున్నారని తెలిపారు. కావున స్వయం సహాయక సంఘాలలోని మహిళలు వారి నెలవారి మీటింగ్లలో ప్రత్యేక ఎజెండాగా మానవ అక్రమ రవాణా ను చేర్చుకొని గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు అవగాహన కల్పించుటకు వివోఏలు నడుంబిగించాలని తెలిపారు. వివోఏలకు ప్రతి కుటుంబంతో మంచి సంబంధాలు కలిగి ఉంటారు, కావున అన్ని కుటుంబాలలో ఈ మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించుటలో ముఖ్యపాత్ర పోషించాలని తెలిపారు. మానవ అక్రమ రవాణా ఆధునిక బానిసత్వంగా పేర్కొనవచ్చు అని తెలిపారు. లైంగిక వ్యాపారం కూడా ఒక పరిశ్రమలాగా అభివృద్ధి చెందుతుంది, దీని పట్ల ప్రజలు చైతన్యంతో మెదలాలని తెలిపారు. ఇట్టి విషయంలో స్వయం సహాయక సంఘాల లీడర్లకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఎస్ఐ నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు కళ్యాణి,కార్యదర్శి రాజమణి, ఎపిఎం దుంపేటి.కిషన్, సీసీలు కుమారస్వామి,రాజయ్య, కృష్ణమూర్తి, సురేష్, ఏలియా, ఆఫీస్ సిబ్బంది కృష్ణ, సుజాత, శివరాజ్,వివో ఏలు కృష్ణవేణి, విజయ,మంజుల,రాణి, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సంగెం మండల కేంద్రంలో రిలే నిరాహారదీక్షలు



సంగెం: (శుభోదయం న్యూస్) : ఈ రోజు దీక్షలో ఎం ఎస్ పి జాతీయ నేత ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి దళిత రత్న అవార్డు గ్రహీత మంద కుమార్ మాదిగ.వరంగల్ జిల్లా ఇన్చార్జి బిర్రు మహేందర్ మాదిగలు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చట్టం తీసుకొచ్చి మాదిగలకు మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.ఆగస్టు 1వ తేదీన సుప్రీంకోర్టు ధర్మాసనం ఎస్సీల వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలే అమలు చేయాలని తీర్పు ఇవ్వడం జరిగింది. సిఎం రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు ప్రకారం విద్య ఉద్యోగ రంగాలలో ఎస్సీల వర్గీకరణ అమలు చేస్తానని. ఉద్యోగ రంగాలలో ఎస్సీల వర్గీకరణ అమలు చేస్తానని.గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ లో కూడా వర్గీకరణ ప్రకారమే ఉద్యోగాలు భర్తీ చేస్తానని అవసరమనుకుంటే ఆర్డినెన్సు తీసుకొచ్చి ఎస్సీల వర్గీకరణ ప్రకారం ఉద్యోగుల భర్తీని చేస్తానని హామీ ఇచ్చి. ఎస్సీల వర్గీకరణ లేకుండా గ్రూప్1.గ్రూప్ 2.గ్రూప్ 3. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ వివిధ శాఖల లో ఉద్యోగ నియామకాలు విడుదల చేసి మాదిగలకు ఉద్యోగాలు రాకుండా సీఎం రేవంత్ రెడ్డి మోసం చేయడం జరిగింది.ఉద్యోగాల భర్తీ నిలిపి వేయాలని వెంటనే సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసి ఎస్సీల వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తున్నాం ఎస్సీల వర్గీకరణ లేకుండా ఉద్యోగాల భర్తీ చేస్తే సిఎం రేవంత్ రెడ్డి ని భూస్థాపితం చేస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో గుండేటి. లవ్ కుమార్ మాదిగ. బొజ్జ సురేష్ మాదిగ. కొలకనూరి యాకయ్య మాదిగ. మెట్టుపల్లి శేఖర్ మాదిగ జన్ను యాకయ్య మాదిగ. బొట్టు శ్రావణ్ మాదిగ మెట్టుపల్లి సుశాంత్ మాదిగ. మెట్టుపల్లి బబ్బులు మాదిగ మెట్పల్లి యాకయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ లో శ్రీ శ్రీ కుమ్మర మొల్ల 585 వ జయంతి వేడుకలు.





బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలో శ్రీశ్రీ కుమ్మర మొల్ల గారి 585 వ జయంతి కుమ్మరి సంఘం లో ఘనంగా జరిగింది. కుమ్మరి సంఘం అధ్యక్షులు బాలయ్య మాట్లాడుతూ..శ్రీ కుమ్మర మొల్ల, అటుకూరి మొల్లగా కూడా పిలవబడేవారు, 16వ శతాబ్దపు తెలుగు కవయిత్రి, తెలుగులో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన రామాయణాన్ని రచించారు. ఆమె కుమ్మరి కుటుంబంలో జన్మించారు, మరియు ఆమె రచనలు పండితులకే కాకుండా సామాన్యులకూ అర్థమయ్యే రీతిలో ఉన్నాయి. నెల్లూరు జిల్లా గోపవరం గ్రామంతెలుగులో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన రామాయణాన్ని రచించారు.ఆమె కుమ్మరి కుటుంబంలో జన్మించారు.ఆమె రచనలు పండితులకే కాకుండా సామాన్యులకూ అర్థమయ్యే రీతిలో ఉన్నాయి.1530లో 90 సంవత్సరాల వయస్సులో మహాసమాధిలోకి వెళ్లింది.కృష్ణదేవరాయలు ఆమెకు "కవిరత్న" బిరుదును ప్రదానం చేశారు.మొల్ల తెలుగులో మొట్టమొదటి రామాయణాన్ని రచించిన కవయిత్రిగా పరిగణించబడతారు అని బాలయ్య తెలిపారు ఈ కార్యక్రమం లో కులసభ్యులు హన్మండ్లు,గంగారం,శ్రీనివాస్,రవి,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి డీఎస్పీ బదిలీ



ఎల్లారెడ్డి, శుభోదయం న్యూస్: ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దాదాపు రెండేళ్ల 9 నెలల కాలంగా పని చేసిన డీఎస్పీ ప్రజలకు మంచి సేవలు అందిస్తూ దగ్గరయ్యారు. అందరినీ ప్రేమగా పలకరిస్తూ నేరాల నివారణపై దృష్టి సారించి, తనకంటూ ఓ మంచి అధికారిగా గుర్తింపు పొందారు. ఆయన్ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలసిందిగా ఆదేశాలు అందాయి. ఆయన స్థానంలో కొత్త డిఎస్పీ ఎవరినీ నియమించలేదు.



## హెూలీ పండుగ శుభాకాంక్షలు
## తెలియజేసిన పోచారం భాస్కర్ రెడ్డి.

బీర్కూర్, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్): బాన్సువాడ నియోజకవర్గ ప్రజలందరికీ హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాల మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి. శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రత్యేక అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసే వేడుక ఈ రంగుల పండుగ హెూలీ ప్రజల జీవితాలను సప్తవర్ణ శోభితం చేయాలని ఆయన అన్నారు.

## పరకాల కాన్స్టిట్యూషన్లో పర్యటించిన కూడా చైర్మన్ ఇనగాల



తెలంగాణ స్టేట్ బ్యూరో కడిదెల రామారావు, (శుభోదయం న్యూస్): ఆత్మకూరు మండలంలోని గుడేప్పాడు గ్రామానికి చెందిన బలభద్ర రాజేందర్ కుమారుని వివాహానికి పరకాల పట్టణంలోని జి.ఎస్.ఆర్ గార్డెన్స్ లో హాజరై నూతన వధూవరులకు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన వరంగల్ కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అక్కంపేట గ్రామంలోని కోదండ రామలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన వరంగల్ కూడా చైర్మన్ ఈ సందర్భంగా ఆలయ పూజారులు, గ్రామ నాయకులు సాదరంగా ఆహ్వానం పలికారు. హౌస్ బూజుర్గ్ గ్రామంలోని ఖాదీయాని ఈద్గా నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన కూడా చైర్మన్,ఆత్మకూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోలా రమేష్ తండ్రి కోలా ఐలయ్య సంవత్సరికం కార్యక్రమానికి హాజరైన వరంగల్ కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఇనగాల వెంట మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఖాజా, జిల్లా బీసీ సెల్ కో కన్వీనర్ చిమ్మని దేవరాజ్, మండల మాజీ వైస్ ఎంపీపీ ముద్దం సాంబయ్య, మండల యూత్ అధ్యక్షులు తనుగుల సందీప్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బయ్య కుమారస్వామి, మండల నాయకులు వడ్డేపల్లి ప్రసాద్, కాడబోయిన రవి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ ప్రహరి గోడ నిర్మాణానికి శంకుస్థాపన



టేక్మాల్ మండలం రిపోర్టర్ కృష్ణ (శుభోదయం న్యూస్): మెదక్ జిల్లాటేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి గ్రామంలో జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ ఆవరణలో 25 లక్షల నిధులతో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి గారు మరియు టేక్మాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ గారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆందోల్ నియోజకవర్గంలో గత పది ఏళ్లుగా జరగని అభివృద్ధి, మంత్రివర్యులు శ్రీ దామోదర రాజనరసింహ గారి హయాంలో కేవలం ఒక సంవత్సర కాలంలోనే జరిగిందని పేర్కొన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల పక్షపాతి అని, ముమ్మందు ఆందోల్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధిలో ఎగ్రగామిగా నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సర్వాణి సరోజ మల్లేశం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లంపల్లి సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ మంజుల రాజు గౌడ్, జోగిపేట వ్యవసాయ శాఖ డైరెక్టర్ రాజేష్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, మండల వ్యవసాయ కమిటీ డైరెక్టర్ పాపయ్య, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు శంకరప్ప, యువజన అధ్యక్షులు మహేష్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వినోద్ కుమార్, సంగమేశ్వర్ రెడ్డి, బాలయ్య, ఆందోల్ విటల్, రామ్ రెడ్డి, బాల్రాజ్, దుర్గయ్య, నాగప్ప, డాకయ్య, యాదయ్య,నర్సింలు, పాండు, కుమార్, లోకేష్, దేవయ్య, నర్సింలు, , వీరన్న, తలారి అవినాష్, మందిర్, అనిల్, గడ్డం రాజు, గ్రామ యువజన నాయకులు, గడ్డం గోపాల్, ధనుంజయ, శ్రీనివాస్, కృష్ణ, నవీన్, మహేష్ రెడ్డి, రాములు, పోచయ్య, చాకలి పాండు, మరియు కాంగ్రెస్ కార్యకర్తలు, మరియు గ్రామ సెక్రెటరీ, మండల ఎంపీడీవో విట్టల్,పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి బాటలు వేస్తున్న కాంగ్రెస్ సర్కార్
## డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



వర్గల్ మండల రిపోర్టర్ విష్ణువర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్) మార్చ్ 13: రాజకీయ జన్మనిచ్చిన వర్గల్ కు జీవితాంతం రుణపడి ఉంటానని, ఇక్కడి ప్రజల సంక్షేమం, అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ ఎస్సీ వాడలో రూ 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వ పాపాలు గజ్వేల్ పాలిట శాపాలుగా మారగా, గద్దలకు దోచిపెట్టే పనులు చేసి నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. గజ్వేల్ నడిబొడ్డున కేవలం పెద్ద పెద్ద భవనాలు నిర్మించి అభివృద్ధి పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు విమర్శించారు. గజ్వేల్ నియోజకవర్గ సమస్యలపై మాట్లాడని స్థానిక ఎమ్మెల్యే కెసిఆర్ ను ఫాంహౌజ్ కే పరిమితం చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు అధిగమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అద్భుత ప్రగతి సాధిస్తున్నారని అడిగిన వెంటనే గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ 5 కోట్లు మంజూరు చేశారని. దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనాలు లక్ష్యంగా గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ 200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. సకల జనుల సంక్షేమం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రక పథకాలు రూపొందించి అమలు చేస్తుండగా, త్వరలోనే అర్హులైన పేదలందరికీ రూ 5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అంతేగాకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నుండి పంటలకు సాగునీరు అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతుండడంతో జీర్ణించుకోలేకపోతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గజ్వేల్ ప్రవీణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రమేష్ ముదిరాజ్, పట్టణ పార్టీ అధ్యక్షులు బాల్రెడ్డి, నేతలు శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మహేందర్ గౌడ్, కిషన్ గౌడ్, పొన్నాల నర్సారెడ్డి, గణేష్ చారి కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన సిబిఐటి
## యొక్క వార్షిక సాంస్కృతిక మరియు క్రీడల ఫెస్ట్ 'శ్రుతి 2025'




హైదరాబాద్, శుభోదయం న్యూస్: తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ సాంకేతిక విజ్ఞాన సంస్థలో మొదటి స్థానంలో వున్నా చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మార్చి 6 నుండి 8, 2025 వరకు జరిగిన 'శృతి 2025' వార్షిక సాంస్కృతిక మరియు క్రీడా ఫెస్ట్, 'శృతి 2025,' విజయవంతంగా ముగిసింది.సిబిఐటి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సివి నరసింహులు, ఇతర ప్రముఖులతో కలిసి ఘనంగా ప్రారంభోత్సవ వేడుక



అథ్లెటిక్స్, ఫుట్బాల్, బాస్కెట్బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ మరియు అనేక ఇతర ఇండోర్ మరియు అవుట్డోర్ ఈవెంట్లను కలిగి ఉన్న క్రీడా పోటీలు చాలా అద్భుతంగా జరిగాయి.శ్రుతి 2025 చైర్మన్ ప్రొఫెసర్ ప్రభాకర్ రెడ్డి తన ప్రసంగంలో ఫెస్ట్ విజయవంతంగా



నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. శ్రుతి 2025ని మరపురాని సంఘటనగా మార్చడంలో ఆర్గనైజింగ్ కమిటీ, అధ్యాపకులు మరియు విద్యార్థుల అంకితభావం మరియు జట్టుకృషిని ఆయన ప్రశంసించారు. ఇటువంటి వేదికలు సాంస్కృతిక మరియు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడమే కాకుండా విద్యార్థులలో నాయకత్వం మరియు సంస్థాగత నైపుణ్యాలను కూడా పెంపొందిస్తాయని ఆయన చెప్పారు. ఆయన పాల్గొనేవారిని వారి ప్రతిభను ప్రదర్శించడాన్ని కొనసాగించాలని మరియు వారి విద్యా మరియు వ్యక్తిగత ప్రయాణాలకు సంబంధించిన అన్ని అంశాలలో రాణించటానికి ( ప ్ య ్ ు తి ్న ం చ ్ వ ు ని ప్రోత్సహించారు.ప్రముఖ భారతీయ చలనచిత్ర దర్శకుడు శ్రీ ఎన్.శంకర్




గౌరవ అతిథిగా హాజరుకావడంతో ఈ కార్యక్రమం మరింత ఘనంగా జరిగింది. తన స్ఫూర్తిదాయకమైన ప్రసంగంలో, అతను సృజనాత్మకత, కథ చెప్పడం మరియు విజయాన్ని సాధించడంలో పట్టుదల యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. విద్యార్థులు తమ అభిరుచులను స్వీకరించాలని, సంప్రదాయ వృత్తి మార్గాలకు అతీతంగా ఆలోచించాలని మరియు వారి కళాత్మక మరియు నాయకత్వ సామర్థ్యాన్ని అన్వేషించడానికి శ్రుతి వంటి వేదికలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరైరు . తన ప్రసంగంలో, భవిష్యత్ నాయకులను రూపొందించడంలో సంపూర్ణ విద్య యొక్క పాత్రను చెప్పారు మరియు విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన మరియు పాఠ్యేతర కార్యకలాపాలలో కళాశాల యొక్క కృషికి ప్రశంసించారు. విద్యార్థులు తమ సమగ్ర అభివృద్ధికి, సమాజానికి అర్థవంతంగా దోహదపడేలా ఇటువంటి వేదికలను ఉపయోగించుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు.వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి వారి అత్యుత్తమ ప్రదర్శనలను గుర్తిస్తూ వారికి బహుమతులు మరియు బహుమతుల పంపిణీ కార్యక్రమం జరిగింది. విద్యాసంస్థలు మరియు పరిశ్రమలకు చెందిన ప్రముఖులు ఈ వేడుకకు విచ్చేసారు, ఇటువంటి కార్యక్రమాల ద్వారా సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించినందుకు కళాశాల ను అభినందించారు.ముగింపు కార్యక్రమంలో ప్రొ.సి.వి.నరసింహులు మాట్లాడుతూ, ఆర్గనైజింగ్ కమిటీకి, విద్యార్థి వాలంటీర్లకు, పార్టిసిపెంట్లకు తన అభినందనలు తెలియజేస్తూ, "శృతి 2025 ప్రతిభకు అవకాశాలను కలిసే వేదికగా మరోసారి నిరూపించబడింది. మా విద్యార్థులు విద్యావిషయాల్లోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో కూడా రాణిస్తున్నందుకు గర్వపడుతున్నామని తెలిపారు.

# రంగుల కేళి......రంగుల కేళి



(శుభోదయం న్యూస్) : సంబరాలు అంబరాన్ని తాకగా పూల రంగులు పున్నమి రోజు పులకించగా
రంగుల హరివిల్లు లోకమంతా విరజిమ్మగా "హెూళికా పూర్ణిమ" రాక్షసిని కామ దహనంలో ఆహుతి చేయగా బృందావనంలో కృష్ణుడు గోపికలతో రంగుల కేళి ఆడగా చెడుపై మంచి విజయాన్ని సాధించగా శీతాకాలానికి వీడ్కోలు పలుకుతూ వసంత కాలానికి ఆహ్వానం పలుకగా మన సంస్కృతి ప్రతిబింబింపగా ఆనంద కేరింతల ఉత్సాహంతో ప్రేమానురాగాల సౌభాగ్యాలు వెల్లి విరియగా, శుభం కలుగగా జనులందరి బతుకులు పున్నమి వెన్నెల కావాలని కోరుకుంటూహెూళి మహెూత్సవ శుభాకాంక్షలతో
రచన:గడ్డం.శ్రీను

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ




యాదాద్రి భువనగిరి జిల్లా (శుభోదయం న్యూస్): రామన్నపేట మండలం ఎల్లంకి గ్రామం లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్వపరిపాలనా దినోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధికారులుగా,రాజకీయ నాయకులుగా, ఉపాధ్యాయులుగా వారి వారి పాత్రలను చక్కగా పోషించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా చెన్నోజు సాయితేజ,డీఈవోగా పి.వర్షిత,కలెక్టర్ ఈ.భవ్య శ్రీ, ఎమ్మెల్యేగా.సాయి,విద్యాశాఖ మంత్రిగా ఆర్.శివశంకర్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిజ్ దామోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను చైతన్యవంతం చేయుటకుగాను వారికి అవేర్నెస్ పెంపొందించడానికి గాని ఇటువంటి కార్యక్రమాలు దొహదం చేస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఏపీసి చైర్పర్సన్ శ్రీమతి పులగం సులోచన ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి ,ఉయ్యాల బిక్షమయ్య ,దూదిగామ సువర్ణ,మందుగుల వెంకటయ్య,కొసనం మాధవి,అంగన్వాడీ టీచర్ జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

# పాఠశాలలో ఆర్ట్, క్రాఫ్ట్ ప్రదర్శన... మంచిర్యాల జిల్లా ప్రతినిధి - శ్రీనివాస్



శుభోదయం న్యూస్: జైపూర్ మండలం కుందారం గ్రామంలోని ఉన్నత పాఠశాల లలో విద్యార్థిని, విద్యార్థులు అద్భుతమైన చిత్రాలు గీసి, పేపర్ తో క్రాఫ్ట్ వర్క్స్ చేసి ప్రదర్శన చేసారు... డ్రాయింగ్ షీట్ లతో ఎన్నో బొమ్మలు ప్రాజెక్టు వర్క్స్ తయారు చేసారు. పాఠశాలలోని ఆర్ట్ టీచర్ చిప్పకుర్తి శ్రీనివాస్ శిక్షణ తో చిత్రకళ లో అనేక మెళకువలు నేర్చుకొని ఎన్నో కాంపిటేషన్ లకు వెళ్లి ప్రతిభ సాధించి అవార్డులు, రివార్డులు సాధించారు. ఈ యొక్క చిత్రకళ ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుండి




శ్రావణి డివిజన్ మేనేజర్, సురేష్ కుమార్ ప్లాంటేషన్ మేనేజర్, సునిత ప్లాంటేషన్ మేనేజర్, ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ పాల్గొన్నారు... ఈ కార్యక్రమానికి వచ్చిన ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ల లకు ఆర్ట్ టీచర్ చిప్పకుర్తి శ్రీనివాస్ వాళ్ళ ఫోటో డ్రాయింగ్ లను గీసి అందజేశారు... ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రామకృష్ణ, లక్ష్మణ్ రావు, సుజాత, రామ్ రెడ్డి, స్వరూప రాణి, రాజమోగిలి, సతీష్ కుమార్, పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు...

# అమ్మవారి కరుణ అందరిపై ఉండాలి ఆలయ చైర్మన్ మురళీ ముదిరాజ్..



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,(శుభోదయం ),మార్చి 13:అమ్మవారి కరుణ అందరిపై ఉండాలని, ముఖ్యంగా మంచి పనులు తలపెట్టేవారికి తప్పకుండా అమ్మవారి దీవెనలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆలయ చైర్మన్ మురళి ముదిరాజ్ అన్నారు. లాల్ బజార్ మహంకాళి ఆలయంలో ప్రతి పౌర్ణమితోపాటు అమావాస్య రోజు అన్నదానాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మురళి ముదిరాజ్ మాట్లాడుతూ.. సుమారు ఏడాది క్రితం 300 మందికి అన్నదానం నిర్వహించే వారిమని, ఇప్పుడు సుమారుగా 1200 మందికి పైగా ప్రజలకు అన్నదానం చేస్తున్నామని అన్నారు. దాతలు ముందుకు వస్తే ఇంకా ఎక్కువ మందికి అన్నదానం ఏర్పాటు చేస్తామని ఆయన పేర్కొన్నారు. మహంకాళి ఆలయంలో ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజున ఏర్పాటు చేస్తున్న అన్నదానాలలో ప్రజలందరూ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

# పేదల అభ్యున్నతి కోసం ఎమ్మెల్యే శ్రీగణేశ్ నిర్విరామ కృషి కాంగ్రెస్ సీనియర్ నేత మురళి ముదిరాజ్



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, (శుభోదయం న్యూస్),మార్చి 13: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేద ప్రజల అభ్యున్నతి కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మురళి ముదిరాజ్ అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గం 7వ వార్డు పరిధిలోని చిన్న కమేళా, సెంట్రల్ బస్త్రీ బస్తీలలోని ఎ1 ల్యాండ్ లో గత 50 సంవత్సరాలకు పైగా నివసిస్తున్న వారికి శాశ్వత పట్టాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే శ్రీగణేష్ విజ్ఞప్తి చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. లాల్ బజార్‌లోని పార్టీ కార్యాలయంలో మురళి ముదిరాజ్ మాట్లాడుతూ... ఈ నెల 12న జరిగిన కంటోన్మెంట్ బోర్డు మీటింగ్ లో భూ బదలాయింపు కింద శాశ్వత పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని, బోర్డు బ్రిగేడియర్, బోర్డు సీఈఓ లకు ఎమ్మెల్యే తెలిపారని చెప్పారు. గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, లాల్ బజార్ లో నివసిస్తున్న పేదప్రజల గురించి ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవని అన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ కు 7వ వార్డు ప్రజలందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరి అదే విధంగా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేయడానికి లాల్ బజార్ మహంకాళి అమ్మవారి ఆశీస్సులు ఎమ్మెల్యే శ్రీగణేష్ కు ఉండాలని మురళి ముదిరాజ్ ఆకాంక్షించారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్



రామగుండం మండలం రిపోర్టర్ - తిరు,(శుభోదయం న్యూస్) : రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ గురువారం రోజున సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాదులో జరుగుతున్న సిఎల్పీ సమావేశాల సందర్భంగా సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



రామగుండం నియోజకవర్గ అభివృద్ధి విషయంలో అవసరమైన నిధుల గురించి సీఎం దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ స్థితిగతులు, నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికల గురించి సీఎం దృష్టికి తీసుకు వెళ్లినట్లు పేర్కొన్నారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన వెంట మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బి.ఆర్.ఎస్ రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



రామగుండం మండలం రిపోర్టర్- తిరు, (శుభోదయం న్యూస్ ): తెలంగాణ శాసన సభ బి.ఆర్.ఎస్ ఎల్.పి కార్యాలయం లో గురువారం తెలంగాణ ఆడబిడ్డ, మన సంస్కృతి సంప్రదాయాల ప్రతీక, శాసనమండలి సభ్యురాలు, మాజీ ఎంపి శ్రీమతి కల్వకుంట్ల కవితక్క గారిని మర్యాదపూర్వకంగా కలిసి వారికి రామగుండం మాజీ శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

# నివాస గృహాల మధ్యలో నిర్మిస్తున్న సబ్ స్టేషన్ పనులను వెంటనే ఆపాలి - బోడుప్పల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి డిమాండ్



మేడిపల్లి, మార్చి13 శుభోదయం రిపోర్టర్ బైరెడ్డి సందీప్ రెడ్డి :- బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పి.ఎన్ నగర్, బి.ఎల్ నగర్ కాలనీల నివాస గృహాల మధ్యలో నిర్మిస్తున్న సబ్ స్టేషన్ పనులను వెంటనే ఆపాలని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తమ కాలనీల మధ్యలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్దంటూ గత కొన్ని రోజులుగా కాలనీల వాసులు ధర్నాకు మంద సంజీవరెడ్డి తమ మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా మంద సంజీవరెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణం కోసం ఇదే స్థలంలో అప్పటి మంత్రి చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించామన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆసుపత్రి నిర్మాణానికి కె టాయించిన అనుమతులను రద్దు చేసి విద్యుత్ సబ్ స్టేషన్ కోసం స్థలాన్ని కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు. కాలనీల మధ్యలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం వద్దంటున్నా అధికారులు ఏకపక్షంగా పనులను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. కాలనీలలో ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలంటే కాలనీవాసుల నుంచి విద్యుత్ శాఖ అధికారులు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుంటారని. అలాంటిది ఏది లేకుండా కాలనీవాసులు వద్దంటున్నా అధికారులు ఏకపక్షంగా ప్రజలకు ఇబ్బందులు కల్గించాలనే 33 కెవి సబ్ సబ్ స్టేషన్ పనులు చేపడుతున్నారని ఆరోపించారు. వెంటనే సబ్ స్టేషన్ నిర్మాణపనులను ఉపసంహరించుకోవాలని సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. కాలనీ వాసుల అభిప్రాయాన్ని ఏమాత్రం లెక్క చేయకుండా నిబంధనలకిరుద్ధంగా నిర్మిస్తున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను వెంటనే ఆపాలని మంద సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం వల్ల పి.ఎన్.ఆర్,కాలనీ.బి.ఎల్.నగర్ ప్రజలకు పలు ఇబ్బందులు ఉత్పన్నమైయ్యే అవకాశాలున్నాయన్నారు. పరిసర కాలనీలలో ఇప్పటివరకు ప్రజలు విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాలేదని. అలాంటిది అధికారులు ప్రజలు వద్దంటున్నా సబ్ స్టేషన్ నిర్మాణపనులను నిరాటంకంగా కొనసాగించడం ఏమిటని సంజీవ రెడ్డి ప్రశ్నించారు. సబ్ స్టేషన్ నిర్మాణపనులు ఆపేదాకా కాలనీవాసులందరి సహకారంతో ఉద్యమిస్తామని సంజీవ రెడ్డి వాచ్చరించారు. అధికారులకు ఏమాత్రం అవగాహన లేకుండా కాలనీల మధ్య పూర్తిగా నివాస గృహాలు ఉన్న ప్రాంతంలో ప్రమాదకరమైన అధిక విద్యుత్ సామర్థ్యం గల సబ్ స్టేషన్ నిర్మించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అధికారులు వెంటనే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణపనులను ఆపాలని, లె నిపక్షంలో పరిసర కాలనీ వాసులందరి సహకారంతో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతుతామని మంద సంజీవ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సామల మనోహర్రెడ్డి, ఉప్పరి విజయ్, కాలనీ వాసులు శంకర్, వెంకటేశం, హేమలత, తిరుపతి, వీరేశం, మధు, అశోక్, సురేష్, బుచ్చయ్య, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారంకై సిపిఎం చేపట్టిన పోరుబాటను జయప్రదం చేయండి మాటూరి బాలరాజు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల వ్యాప్తంగా నెలకొన్న స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం మార్చి 14 వ తేదీ నుండి 28 తేదీ వరకు జరుగు సిపిఎం పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు పిలుపునిచ్చారు.గురువారం వలిగొండ మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గత, నేటి పాలకుల మొద్దు నిద్ర వల్ల బునాది గాని కాల్వ పూర్తిచేయక పోవడంతో మండలంలోని అనేక గ్రామాల్లో సాగు తాగునీరు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని వరి పంట చేతికందే సమయంలో సుమారు 600 ఎకరాల పంట పొలాలు మండలంలో ఇప్పటికే ఎండిపోయాయని ఈనెల చివరి వరకు లేదా ఏప్రిల్ లో ఇది మరింత ప్రమాదం పెరిగేందుకు అవకాశాలు ఉన్నాయని పాలకులు వెంటనే స్పందించి బునాది గాని కాల్వ ద్వారా సాగు నీటిని అందించి పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయలు నష్టపరిహారం అందే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లాను కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.గ్రామాల్లో ప్రజాప్రతినిధుల పాలన లేక అనేక సమస్యలు తిష్ట వేసి కూర్చొని ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని త్రాగునీరు సక్రమంగా అందే పరిస్థితిలో లేదని మురుగు కాలువలు, పెన్షన్లు,రేషన్ కార్డులు,ఇండ్లు ఇళ్ల స్థలాలు లాంటి వాటితో పాటు అనేక వ్యక్తి గత సమస్యలు పెండింగ్ లోనే ఉన్నాయని వెంటనే వాటన్నిటినీ అందించాలని సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెల మొత్తం ప్రజా పోరాట కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు.మార్చి 14 నుండి 28 వరకు మండల వ్యాప్తంగా ప్రజా సమస్యలపై గ్రామాల్లో దీక్షలు,నిరసన కార్యక్రమాలు నిర్వహించి మార్చి 29న తహసిల్దార్ కార్యాలయం ముట్టడి నిర్వహిస్తామని ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశానికి కందడి సత్తిరెడ్డి అధ్యక్షత వహించగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య,మండల కార్యదర్శి సిర్పంగి స్వామి, జిల్లా కమిటీ సభ్యులు గణపతి రెడ్డి, మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం కూర శ్రీనివాస్,వాకిటి వెంకట్ రెడ్డి, మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్,కలుకూరి ముత్యాలు, కర్ణకంటి యాదయ్య, భూమి మాధవి,తదితరులు పాల్గొన్నారు.

# ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దు, మహిళల పట్ల మర్యాదగా ఉండాలి సంప్రదాయ పద్ధతుల్లో హెూలీ జరుపుకుందాం రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా




రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) ఎదుటివారికి ఇబ్బంది కలిగించకుండ , మహిళల పట్ల మర్యాదగా ఉంటూ సంప్రదాయ పద్ధతుల్లో హెూలి జరుపుకుందామని రామగుండము పోలీస్ కమిషనర్ ప్రజలకు పిలుపునిచ్చారు. హెూలీ పండుగ సందర్బంగా రామగుండము పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ప్రజలకు ప్రజలకు పలు సూచనలు చేస్తూ. సహజ సిద్ధమైన రంగులను వినియోగిస్తూ హెూలీ పండుగను ప్రశాంతవంతమైన వాతావరణంలో జరుపుకోవాలని, ముఖ్యంగా ఎవరు కూడా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని,హెూలీ అనంతరం యువత స్నానాల కోసం శివారు ప్రాంతాల్లోని చెరువులు, లోతట్టు ప్రాంతాలకు వెళ్ళవద్దని, ప్రధానముగా బహిరంగ ప్రదేశాలపై, అనుమతి లేకుండా వ్యక్తులపై, మహిళలు, యువతులు, వాహనాలపై రంగులు చల్లడం బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చర్యలు తప్పవని. హెూలీ పండుగను సజావుగా జరుపుకొనేందుకు రామగుండము పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మర పెట్రోలింగ్ నిర్వహించబడుతుందని, ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వారిపై పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఈనెల మార్చి31 లోపు నగర ప్రజలు ఆస్తి పన్ను చెల్లించి నగరపాలక సంస్థకు సహకరించగలరు

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ**




గోదావరిఖని టౌన్ రిపోర్టర్,- సురేష్,(శుభోదయం న్యూస్) మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం 2024-25 ముగియనున్న నేపథ్యంలో ప్రజలు పన్నులు చెల్లించడానికి వీలుగా ఈ నెలలో అన్ని సెలవు దినాల్లోనూ నగర పాలక సంస్థ కార్యాలయం లోని కౌంటర్లు యధాతధంగా పని చేస్తాయని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఈ నెల 31 లోగా ఆస్తి పన్ను లు , నల్లా బిల్లులు , లైసెన్స్ రుసుంలు వార్డు అధికారుల వద్ద చెల్లించే సౌలభ్యంతో పాటు మీ సేవా కేంద్రాల్లో , మున్సిపల్ వెబ్ సైట్(%వఎబఅఅషఇజూఖశ్రీ.వశ్రీఖఅస్త్రఖు.స్త్రశీజ.ఱఅ% ) ద్వారా ఆన్ లైన్ లోనూ డిజిటల్ పేమెంట్ ఇంటి వద్ద నుండి కూడా చేయవచ్చని తెలిపారు. కావున పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్ను బకాయదారులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బి.ఆర్.ఎస్ ఎమ్మెల్సీ శ్రీమతి కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు తెలంగాణ జాగృతి యువజన విభాగం మరియు టీబీజీకేఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) రామగుండంలో గురువారం రోజున తెలంగాణ జాగృతి యువజన విభాగం బొగ్గుల సాయి కృష్ణ ఆధ్వర్యంలో మరియు టీబీజీకేఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో కవితక్క గారి జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక్ హరి, టీబీజీకేస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి, పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ, ప్రపంచ ఖ్యాతి పొందిందంటే అంటే శ్రీమతి కల్వకుంట్ల కవితక్క గారి ఎనలేని కృషి వల్లనే అని, ఈరోజు బీసీ నినాదం కవితక్క గారు తీసుకోవడం వల్లనే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు బీసీ సర్వేను నిర్వహించడం బిసి రిజర్వేషన్ గురించి మాట్లాడడం జరుగుతుంది అని కవితక్క జాగృతి సంస్థను ఏర్పాటు చేసి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచ ఖ్యాతికి చేయడం జరిగింది తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో యువకులకు, విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ నిర్వహించి మరియు అనేక సేవా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. అంతేకాకుండా టీబీజీకేస్ గౌరవాధ్యక్షురాలుగా ఉన్న కవితక్క సింగరేణికి అనేక సేవలు చేయడం జరిగిందని ఈరోజు మహిళలకు సింగరేణి ఉద్యోగ కల్పనా గాని డిపెండెంట్ ఎంప్లాయిమెంట్ నిర్వహించడంలో గానీ కవితక్క గారి ఏనలేని కృషి ఉందని టీబీజీకేస్ నాయకులు తెలియజేయడం జరిగింది మరి గురువారం రోజున జన్మదినం జరుపుకుంటున్న కవితక్క గారికి మరొక్కసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరిన్ని జరుపుకుంటూ భవిష్యత్తులో మరెన్నో గొప్ప పదవులను అధిరోహించాలని భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.ఈ కార్యక్రమంలో భాగంగా టీబీజీకేఎస్ నాయకులు మదాసు రామ్మూర్తి, నూనె కొమురయ్య, వడ్డేపల్లి శంకర్, చిలుపూరు సతీష్, వెంకట్, బొడ్డు రమేష్, తెలంగాణ జాగృతి నాయకులు అందే సదానందం, జాగృతి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు తోట హరీష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ బక్కి రాజకుమారి కిషన్, మద్దికుంట శంకర్, నిమరాజుల రవి,పున్నం శశి కుమార్, షాడోవేని రాజు, గడాపురం కళ్యాణ్, తలవారి సిద్దేశ్వర,కందుకూరి రాజు,మేకల శ్రీనివాస్ యాదవ్,ఫయాజ్, ఉప్పు సాయికుమార్, మాటూరి వినోద్,అనిల్ జాగృతి నాయకులు ఎనగంటి మురళి ,ప్రతాప్, గుర్రం సాగర్ గౌడ్, సమరం,సట్టా అక్షయ్, రాజు, నరేష్ ,బిఆర్ఎస్ నాయకులు, పలువురు జాగృతి నాయకులు టీబీజీకేఎస్ నాయకులు పాల్గొనడం జరిగింది.



## రామన్నపేట మండల ప్రజలకు హోలీ శుభాకాంక్షలు ఎస్కే చాంద్‌టిఆర్ఎస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్



యాదాద్రి జిల్లా భువనగిరి (శుభోదయం న్యూస్) : రామన్నపేట మార్చి 13తెలంగాణ ఉద్యమకారులకు,రామన్నపేట మండల ప్రజలకు,టిఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు,వివిధ పార్టీల నాయకులకు,అధికారులకు, యువజన సంఘాలకు, విద్యార్థి సంఘాలకు,వివిధ కుల సంఘాలకు హోలీ పండుగ శుభాకాంక్షలు హోలీ పండుగ అనేది అందరూ కలిసి చేసుకుని సంతోషకరమైన పండుగ ఈ పండగను ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని కోరుతూ నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఆశీస్సులతో మండల వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తానని తెలిపినారు.

## తబితా ఆశ్రమం అమ్మాయికి ఉన్నత విద్య కోసం ల్యాప్‌టాప్ సహాయం చేసిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్, (శుభోదయం న్యూస్) ఉన్నత చదువుకుతోడ్పడేందుకు ల్యాప్‌టాప్ అందించడంలో మీ సహాయాన్ని మరువలేము అని విద్యార్థిని శ్రీజ మరియు తబితా ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్ర నాయక్ గార్లు అన్నారు.శ్రీజ అనే విద్యార్థిని జీవితం అనేక ముఖ్యమైన సవాళ్లను ఎదురుకుందని వాటిని అధిగమించి మంచి భవిష్యత్తును సృష్టించుకోవాలని నిశ్చయించుకున్నానని, నేను 8వతరగతి చదువుతున్నప్పుడు నాన్న వేధింపుల కారణంగా మా అమ్మ తన ప్రాణాలను తీసుకెళ్ళిందని, ఈ అట్టి సంఘటన నా సోదరిని మరియు నన్ను బలహీన స్థితిలోకి నెట్టిందన్నారు అదృష్టవశాత్తూ, మా తాతలు పేదరికంతో పోరాడుతున్నప్పటికీ ప్రేమ మరియు మద్దతునిస్తూ మమ్మల్ని వారి సంరక్షణలో తీసుకున్నారని తెలిపారు.వారి ఆర్థిక ఇబ్బందుల కారణంగా, నేను 8వ తరగతి నుండి నివసించిన తబితా ఆశ్రమంలోనే ఉంటూ చదువుకుంటూ స్టేషనరీ, ఫీజులు మరియు ఇతర నిత్యావసర వస్తువులతో సహా నా అన్ని అవసరాలకు ఆశ్రమమే వెన్నెముకగా మారిందన్నారు. ఆలా ఎన్ని కష్టాలు ఎదురైనా 10వ తరగతిలో 10 జీపీఏ, ఇంటర్మీడియట్ పరీక్షల్లో 983/1000 మార్కులు సాధించి చదువులో రాణించాను.ఈ విజయాలు నాకు జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, తిమ్మాపూర్, కరీంనగర్‌లో అడ్మిషన్ పొందాను , అక్కడ నేను ప్రస్తుతం బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బి.టెక్) 2వ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ( సి ఎస్ ఈ -ఏఐఎంఎల్ )లోచదువుతున్నాను.అయినప్పటికీ, నా విద్యా ప్రయాణం సవాళ్లు లేకుండా లేదు. కాలేజీలో చేరిన తర్వాత, మా నాన్న హఠాన్మరణంతో సహా నా కుటుంబ పరిస్థితుల కారణంగా నేను ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఫలితంగా, నేను నా 1-1 మరియు 1-2 సెమిస్టర్‌లలో కాలేజీకి హాజరు కావడంలో సక్రమంగా లేను, ఇది నా పనితీరును ప్రభావితం చేసింది మరియు తక్కువ జిపిఏ కి దారితీసిందని, మెరుగుపడాలని నిశ్చయించుకుని, నేను 2-1 సెమిస్టర్ నుండి నా చదువులపై మళ్లీ దృష్టి సారించాను. నేను నా కోర్సులో పురోగమిస్తున్నప్పుడు, సి, పైతాన్ మరియు జావా వంటి కోడింగ్ భాషలను నేర్చుకోవడంతోపాటు మినీ ప్రాజెక్ట్‌లు, రియల్-టైమ్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌లు మరియు ఇతర విద్యాపరమైన అవసరాలపై పని చేయడానికి ల్యాప్‌టాప్ కలిగి ఉండటం యొక్క ప్రాముఖ్యతను నేను గ్రహించానని,కాబట్టి, ల్యాప్‌టాప్ కావాలి అని కోరిన వెంటనే జిల్లా కలెక్టర్ శ్రీ కోయ హర్ష నూతన ల్యాప్ టాప్ ఇవ్వడంలో వారి సహాయాన్ని నేను జీవితంలో మర్చిపోలేను అని పేర్కొన్నారు. నా చదువుపై దృష్టి కేంద్రీకరించడానికి, నా కోడింగ్ నైపుణ్యాలను పెంపొందించడానికి మరియు మంచి ఉద్యోగాన్ని పొందే అవకాశాలను పెంచడంలో జిల్లా కలెక్టర్ గారి సహాయం మరువలేనిది అన్నారు.నాకు అమ్మ అయిన నాన్న అయినా నాకు తబితా ఆశ్రమమే అని శ్రీజ కంట తడి పెట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ హర్ష గారు శ్రీజ కు ల్యాప్ టాప్అందించినందుకు రామగుండం నియోజవర్గ స్వచ్ఛంద సంస్థల ఐక్య వేదిక తరుపున వారికి అభినందనలు తెలిపారు.

## నాభిశిల బొడ్రాయి వార్షికోత్సవం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్న భక్తులు

ఆడపడుచులు బోనాలతో ఊరేగింపు

కనుల పండగ సాగిన వార్షికోత్సవం



అనంతగిరి (శుభోదయం న్యూస్) : సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల పరిధిలోని గోల్ తండా గ్రామంలో నాభిశిల బొడ్రాయి ప్రతిష్టించి మూడు సంవత్సరాలు కావడంతో ప్రతి సంవత్సరం ఇలాగే ఈ సంవత్సరం కూడా నాభిశిల బొడ్రాయి వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన ఈ వార్షికోత్సవానికి సూర్యాపేట జిల్లా ఆదివాసి ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాబు నాయక్ పాల్గొని మాట్లాడారు... గ్రామదేవతలను ఏర్పాటు చేసుకొని మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా ముత్యాలమ్మ కు ఆడపడుచులు బోనాలతో గ్రామంలో ఊరేగింపుగా అమ్మవారికి సమర్పించారని తెలిపారు. గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులు అమ్మవారికి తీర్థ ప్రసాదాలు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేణు, సైదులు, బికు, శివాజీ, దుర్గ ప్రసాద్, కోటేశ్వరరావు, కృష్ణ,కస్సు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుభిక్షంగా ఉండాలి అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్క్ శ్రీనివాస్ రెడ్డి



అనంతగిరి: (శుభోదయం న్యూస్) : ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని అనంతగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముస్క్ శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం అనంతగిరి మండల పరిధిలోని కొత్త గోల్ తండా గ్రామంలో నాభిశిలా బొడ్రాయి ప్రతిష్టించి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా ముత్యాలమ్మ బొడ్రాయిని దర్శించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ పెద్దల సమక్షంలో జరిగిన వార్షికోత్సవానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై మొక్కలు చెల్లించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గునుకుల గోపాల్ రెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, దేగ కొండయ్య, ముత్తినేని కోటేశ్వరరావు, గ్రామ పెద్దలు వేణు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల తల్లిదండ్రులకు ఆటల పోటీలు :పలువురిని ఆకట్టుకున్న ఆటల పోటీలు

:చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్న పిల్లల తల్లిదండ్రులు



కోదాడ, (శుభోదయం న్యూస్) : స్థానిక 17వ వార్డు నయా నగర్ లో గల %ఖ×ఙ్గజుజు% పాఠశాలలో ఘనంగా తల్లిదండ్రుల క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలకు ముఖ్యఅతిథిగా మాజీ వార్డ్ కౌన్సిలర్ బత్తినేని హనుమంతరావు పాల్గొని డైస్ వేసి ఆటల పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒడిదుడుకులు నిత్యజీవితంలో వంటగదికే పరిమితమైన తల్లిదండ్రులకు ఆటల పోటీలను ఏర్పాటు చేయడం



అభినందనీయమని అన్నారు మనం ఒక నాడు చిన్న పిల్లలమే మేము మీలానే ఆడుకున్నాము ఇవి మా తీపి జ్ఞాపకాలు అని పిల్లలకు చెబుతూ ఆటలలో చక్కని ప్రతిభ కనబరిచారని అన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పాఠశాల యాజమాన్యాన్ని పిల్లల తల్లిదండ్రులు అభినందించారు. అనంతరం కౌన్సిలర్ ఆటలు వాడి తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం గులామ్ మంజూర్,పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## బీర్కూర్ లో సర్కార్ కామదహనం



బీర్కూరు, మండలం రిపోర్టర్ (శుభోదయం న్యూస్):కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం రాత్రి ఓల్డ్ వాటర్ ట్యాంక్ వద్ద సర్కార్ కాముని దహనం నిర్వహించారు. గ్రామపెద్దలు అందరు కలిసి గ్రామ ప్రధాన కూడలి అయిన ఓల్డ్ వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేశారు. కముని దహనం అనంతరం మరుసటి రోజు హోలీ పండుగను జరుపుకుంటున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. శాంతికి, సౌభ్రాతృత్వానికి ప్రత్యేక అన్నివర్గాల ప్రజలకు ఏకం చేసే వేడుక ఈ రంగుల పండగ హోలీ ప్రజలు జీవితాలను సప్తవర్ణ శోభితం అని గ్రామ ప్రజలు తెలిపారు

## నర్సంపేట్ ఖానాపూర్ మండలం లో విషాదం



తెలంగాణ స్టేట్ ద్వారా ( కడిదల రామారావు ) (శుభోదయం న్యూస్) : వరంగల్ నుండి కొరివికి బయలుదేరిన ఎస్ రెడ్డి రమేష్ ఫ్యామిలీ ఫ్యామిలీ 11థ్ డే దశదినకర్మకు హాజరై తిరిగి వస్తున్న క్రమంలో నర్సంపేట్ ఖానాపూర్ మధ్యలో తన కారు టైరు పంచర్ అవడంతో అదుపుతప్పి డివైడర్ను ఢీకొని ఫల్టీ కొట్టడం జరిగింది అందులో ఉన్న ఐదుగురిలో ఇద్దరు స్పాట్ లో చనిపోవడం జరిగింది డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి ఎస్ రెడ్డి రమేష్ ముందు కూర్చున్న మరో వ్యక్తి బొల్లగుడ్డ హరీష్ క్షేమంగా బయటపడ్డారు వెనకాల కూర్చున్న ఇద్దరు స్పాట్లో ఏసి రెడ్డి యశోద డోలుగోడు మాణిక్యమ్మ స్పాట్లో చనిపోవడం జరిగింది కిలా వరంగల్ ప్రజానీకం శోకసముద్రంలో బాధను వ్యక్తపరిచారు

## గుండేడు గ్రామం యొక్క రుణం తీర్చుకుని గ్రామ అభివృద్ధిలో తనవంతు సాయం చేసిన.. వ్యాపారస్తుడు నాగపురి రాజు గౌడ్



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్) ,మార్చి 13:కమలాపూర్ మండలం గుండేడు గ్రామానికి చెందిన నాగపురి రాజు గౌడ్. హైదరాబాదులో వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాడు.తను పుట్టిన గ్రామమైన గుండేడు గ్రామానికి ఏదైనా చేయాలనే పనతోస్థానికుల సహకారంతోనిరుపేద విద్యార్థులు చదువుకునే గ్రామం లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తన స్వంత ఖర్చులతో తరగతి గదులకు



కావాల్సిన తలుపులు,రంగులు వేయించడం కోసం అదేవిధంగా.గుండేడు నుండి ఇతర ప్రాంతాలకు బస్సులలో,ప్రైవేటు వాహనాల్లో వెళ్ళే వారికి గ్రామం లో సరైన బస్ స్టాప్ లేక పోవడంతో బస్ స్టాప్ నిర్మాణం ను,పోచమ్మ గుడిని అభివృద్ధి కోసం,అదే విధంగా కన్నూర్, గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు పెయింటింగ్ చేయడానికి, నేడు కొబ్బరికాయలు కొట్టి పనులను ప్రారంభించడం జరిగింది. నాగపూరి రాజ్ గౌడ్ ఔదార్యాన్ని చూసి పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.అభివృద్ధి చెందిన ప్రతి ఒక్కరూ గ్రామానికి ఏదైనా ఒక మంచి పని చేస్తే ప్రతి గ్రామం అభివృద్ధి బాటలో నడుస్తుంది అని పలువురు ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ యొక్క కార్యక్రమంలో, నాగపూరి సాంబయ్య , మాజీ జెడ్పిటిసి, కళ్యాణి లక్ష్మణ్ రావు, సత్యనారాయణ రావు, నవీన్, మాట్ల రమేష్, మేకల రవి, తిరుపతిరావు, చిన్న సాంబయ్య, ఓదెలు, నాంపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ఆరోపణలు తో ఏలూరు జిల్లా చాట్రాయి ఎంఆర్ఓ డి. ప్రశాంతి సస్పెండ్



నూజివీడు ప్రతినిధి, మార్చి 13. (శుభోదయం న్యూస్):నిబంధనలకు విరుద్ధంగా భూములకు మ్యుటేషన్ చేయడం, ఆఫీస్ కు వచ్చే వారిపైన దురుసుగా ప్రవర్తించడం పైన పిర్యాదు చేసిన ప్రజలు.పిర్యాదులు పరిశీలించి కలెక్టర్ వెట్రిసెల్వి రెండు సార్లు నోటీసులు ఇవ్వడం జరిగింది.అయినా ప్రవర్తన మారకపోవడంతో సస్పెండ్ చేశాం అని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రకటించారు.

## వెబ్ డిజైనింగ్ మరియు డెవలప్మెంట్ పై అవగాహన




నంద్యాల రిపోర్టర్‌బిమోహన్ (శుభోదయం న్యూస్): స్థానిక శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్-ఎస్ యూనిట్, డేటా సైన్స్ విభాగము మరియు ఐఐసీ ఆధ్వర్యంలో వెబ్ డిజైనింగ్ మరియు డెవలప్మెంట్ పై అవగాహన సదస్సును బండి ఆత్మకూర్ ఏపీ మోడల్ స్కూల్ నందు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకొని సాఫ్ట్ వేర్ రంగంలో రాణించాలని తెలిపారు. వెబ్ సైట్ రూపకల్పన, యూజర్ అనుభవం పై దృష్టి సారించి వెబ్ అప్లికేషన్ ల పనితీరును ప్రోగ్రామింగ్ మరియు కోడింగ్ ద్వారా నిర్మించవచ్చని తెలిపారు. హెచ్ టి ఎమ్ ఎల్, సిఎస్ఎస్ మరియు జావా స్క్రిప్ట్ వంటి కోడింగ్ భాషలను ఉపయోగించి వెబ్ సైట్ లను రూపొందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డేటా సైన్స్ విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కోడింగ్ పై అవగాహన కల్పించారు. వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేయడం, ఫొటోస్ అప్లోడ్ చేయడం వంటి వాటిని స్థానిక విద్యార్థులచే చేయించారు. ఈ కార్యక్రమం లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అబ్దుర్ రఫీ, ఉపాధ్యాయులు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సాదియా ఫాతిమా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్): గురువారం పాణ్యం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేస్తూ అక్కడ సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రోగుల సదుపాయాల గురించి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల నైట్ డ్యూటీలు రోస్టర్ రిజిస్టర్ ప్రకారం షిఫ్ట్ పద్ధతిలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎందుకు సిజేరియన్ డెలివరీలే అధికంగా జరుగుతున్నాయని కలెక్టర్ వైద్యాధికారులను ప్రశ్నించారు. ఈఈ హాస్పిటల్ ఆన్లైన్ రిజిస్టర్లు, ఫార్మసీ రికార్డ్స్, డెలివరీ రిజిస్టర్, లేబరేటరీ తదిత రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా స్టాక్ పూర్తికాక ముందే ఇండెంట్ చేసి మందులను తెప్పించుకోవాలన్నారు. గర్భిణీల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో అంతర్గత రోడ్లు, లైటింగ్ లేదని రోగులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా త్వరలోనే మంజూరు చేయిస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం పాణ్యం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని తనిఖీ చేస్తూ సదుపాయాల గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట పాణ్యం తాసిల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ
## నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున గుప్తా




నంద్యాల రిపోర్టర్బిమోహన్ (శుభోదయం న్యూస్): ట్రాఫిక్ పోలీసులు మరియు, ప్రభాత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ , పార్నపల్లి సంయుక్తంగా రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ నియమ నిబంధనలపై ప్లక్ కార్డులు చేత పట్టుకొని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ నంద్యాల పట్టణ కేంద్రంలోని టెక్కే నుండి గాంధీ చౌక్ వరకు సుమారు 120 మంది విద్యార్థులతో మరియు ట్రాఫిక్ అధికారులు మరియు సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.మోటార్ వెహికల్స్ (ఎంవీ) చట్టం ఉల్లంఘనల ప్రభావం మరియు పెరిగిన చలాన్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.విద్యార్థులు ప్లక్ కార్డులు పట్టుకుని, హెల్మెట్ ధరించడం, సీట్బెల్ట్ ఉపయోగించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వంటి ఇతర అంశాలతో నినాదాలు చేశారు. ర్యాలీ సందర్భంగా మద్యం తాగి వాహనం నడపడం, అతివేగం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఉపయోగించడం వంటి ఉల్లంఘనలకు పెరిగిన జరిమానాల గురించి సమాచారం ఉన్న పత్రాలను పంపిణీ చేశారు.స్థానిక ప్రజలు పోలీసు సిబ్బందిని మరియు విద్యార్థుల శ్రమను ప్రశంసిస్తూ, తమ మద్దతు తెలిపారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థినిలు





సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థినిలు ఎంపికైనట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎస్ శ్యాం ప్రసాద్ తెలిపారు. ప్రకాశం జిల్లా కబడ్డీ సబ్ -జూనియర్ బాల బాలికల కబడ్డీ ఎంపికలు ఈనెల 09/03/25 వ తేదీన ఒంగోలులోని మినీ స్టేడియంలో జరిగాయి.ఈ సెలక్షన్స్ ప్రక్రియలో సత్తా చాటిన పాకల విద్యార్థినిలు 1) కె.నందిని 2) పి స్వాతి 3) ధనలక్ష్మి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి.హజరత్తయ్య తెలిపారు. వీరు ఈనెల 14నుంచి 16 వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కుర్రా. భాస్కర రావు , కార్యదర్శి వై.పూర్ణ పూర్ణచంద్రరావు వ్యాయామ ఉపాధ్యాయులు పి.హజరత్తయ్య ధన్యవాదాలు తెలిపారు. ఎంపికైన విద్యార్థినిలను ఎస్ఎంసి సభ్యులు, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు,గ్రామస్తులు మరియు ఉపాధ్యాయులు అభినందించారు

## యర్రగొండపాలెంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేసిన ఎరిక్షన్ బాబు
## 26 మందికి 42 లక్షల చెక్కులు పంపిణి



ఎర్రగొండపాలెం, మండల రిపోర్ట్ నారాయణ (శుభోదయం న్యూస్): యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్-చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 26 మందికి మొత్తం




రూ.42,12,564/- ల చెక్కులను ఎరిక్షన్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్నవారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, ఎరిక్షన్ బాబు కు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ భరించలేక ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండలం పరిధిలోనే మారెళ్ళ గ్రామానికి చెందిన పుండుకూర రామాంజనేయులు(45) అనే రైతు అప్పుల బాధ భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడ్డ పుండుకూర రామాంజనేయులు భార్య మహేశ్వరమ్మ తెలిపిన వివరాల మేరకు పుండుకూర రామాంజనేయులు అనే రైతు తనకున్న వ్యవసాయ పొలముతో పాటు అదనంగా 10 ఎకరాలు కౌలుకు కి సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటూ ఉన్నారని, అయితే ఇటీవల పంటల సాగు కోసం చేసిన అప్పులు ఎక్కువ కావడంతో వాటిని ఎలా తీర్చాలనే మనోవేదనకు గురై వాముదొడ్డిలో చెట్టుకు ఉరేసుకొని మృతి చెందినట్లు ఆమె తెలిపారు. మృతి చెందిన రైతుకు పెండేకల్ ఆర్ఎస్ స్టేట్ బ్యాంకులో ఉన్న అప్పుతోపాటు ప్రైవేట్ వ్యక్తుల వద్ద దాదాపు రూ 15 లక్షల వరకు అప్పు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ సలహాదారుడు సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు రామయ్య యాదవ్, దేవరెంటి వెంకటరాముడు, వైసిపి నాయకులు లింగన్న తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్న రామాంజనేయులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. ఈ విషయంపై మృతుని భార్య మహేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు తుగ్గలి ఎస్సై కృష్ణమూర్తి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## చీరాలలో ఘనంగా పౌర్ణమి సాగర హారతి



చీరాల, శుభోదయం న్యూస్:చీరాలలో వాడరేవు నందు గల ఆంజనేయ స్వామి ఎదురుగా సాగర తీరాన పౌర్ణమి సందర్భంగా సామూహిక సాగర హారతి కార్యక్రమాన్ని హిందూ చైతన్య వేదిక చీరాల నియోజకవర్గ ప్రముఖ డాక్టర్ తాడివలస దేవరాజు ,బండారు జ్వాల నరసింహం, అర్చక స్వాములు మరియు వేద పండితులు కారంచేటి నగేష్ కుమార్, విట వెంకటేష్ మరియు కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో స్పటిక శివలింగానికి పంచ అమృతలతో అభిషేకం, మంతర పుష్పం మరియు సామూహిక సాగర హారతి కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది.ముఖ్య అతిథిగా గుంటూరు నుండి ఆర్ స్ స్ విభాగ్ సంపార్క ప్రముఖ్ కృష్ణ మోహన్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాగర హారతి నిర్వాహకులు డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ శివానుగ్రహంతో ఎంతో విజయవంతంగా ప్రతి పౌర్ణమికి సాగర్ హారతి చీరాల ఓడరేవులో ఎంతో వైభవంగా జరుగుతుందని త్వరలో మరకత శివ లింగంతో అభిషేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న హిందూ సంఘాలకు మరియు చీరాల శాసనసభ్యులు ఎం ఎం కొండయ్య గారికి,



పోలీస్ సిబ్బంది, ఓడరేవు పంచాయతీ సిబ్బందికి , ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిక్కి నారాయణ, గురవయ్య రామకృష్ణ, ఓడరేవు టిడిపి నాయకులు మరియు గ్రామ పెద్దలు, కారంచేటి నగేష్ కుమార్, కార్తీక్ శర్మ ,విట వెంకటేశ్, కోటి గోపి యాదవ్ , రఘు, అంబటి మారుతి రామ్ , వేద శ్రీ, శ్రీనివాస్ వుల్లగంటి , డాక్టర్ సభరి , గుమ్మ బాలాజీ, మల్లికార్జున్ రావు, లక్ష్మి శ్రీనివాస్, భవాని, శ్రీ మహాలక్ష్మి మహిళా భజన బృందం సభ్యులు, ఓడరేవు ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## డాక్టర్ ఫణీంద్ర బాబు
## ఆధ్వర్యంలో జాతీయ ఫైలేరియా నిర్మూలన కార్యక్రమం



(శుభోదయం న్యూస్), టి.నరసాపురం: ఏలూరు జిల్లా టి.నరసాపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మండలంలో నాలుగు సచివాలయంలో ఐదు ఫైలేరియా కేసులకు ప్రభుత్వం అందించినటువంటి వాటర్ టబ్, టవల్, సబ్బు ,మరియు ఆయింట్మెంట్, ఇవ్వడం పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణీంద్ర బాబు మాట్లాడుతూ ఫైలేరియా బోదకాలు వ్యాధి అనేది క్యూలెక్స్ దోమ కుట్టడం వలన వస్తుందని మురిగి నీటిలో నివాసం ఉంటుందని అన్నారు. ఇది రాత్రివేళలో మనిషి నిద్రపోయిన తర్వాత కుట్టడం జరుగుతుందని అన్నారు. మాటిమాటికి జ్వరం రావడం, మొదలైన లక్షణాలు ఉండును లక్షణాలు బయటపడిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గారిని సంప్రదించాలని ఆయన సూచించారు. బోదకాలు వ్యాధి అనేది కాలుకి గాని చెయ్యికు గాని మొదలైన భాగాలలో వచ్చును అని ఆయన అన్నారు. వ్యాధి తీవ్రత పెరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ప్రభుత్వం వారు ఇచ్చినటువంటి డి ఈ సీ మాత్రలు 6 నెలలకు ఒకసారి 12 రోజుల కోర్సు రోజుకి మూడు మాత్రల చొప్పున వేసుకోవాలి అని ఆయన తెలిపారు. ఈ మాత్రలతో పాటు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, మరియు హెల్త్ సూపర్వైజర్లు, పి. మావుళ్ళమ్మ, ఎమ్ డి ఏ ఎస్ బౌగ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తకుండా బ్రేకర్ల ఏర్పాటు



రెంటచింతల,మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సబ్ స్టేషన్లలో బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ సీపీ డీసీ ఎల్ మాచర్ల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నూతలపాటి సింగయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని పాల్వాయి విద్యుత్ సబ్ స్టేషన్ లో రూ. 50 లక్షల బియ్యంతో నూతనంగా ఏర్పాటుచేసిన బ్రేకర్ ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. పాల్వాయి గ్రామానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు వీటిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతోనే వ్యవసాయ మోటార్లతో పాటు గ్రామాల్లో నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. కాలం తీరిన, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలతో పాటు తీగలను తొలగిస్తూ కొత్తవి ఏర్పాటు చేస్తూ మారుమూల గ్రామాలలో సైతం వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక విద్యుత్ అధికారి షేక్ మస్తాన్ వలి, లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసాచారి, పలువురు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామానికి త్రాగునీరు అందించే భాగంగా అధికారులు నాయకులు



శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: మరుప్రోలు వారి పాలెం పంచాయితీలోని ప్రభుత్వ భూమి సర్వే నం 234/5 డొంక పోరంబోకు స్థలములో జల్ జీవన్ మిషన్ పథకం లో భాగంగా గ్రామానికి తాగునీరు అందించే క్రమంలో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించడానికి స్థలం సేకరణలు సర్వే చేస్తున్న సర్వేయర్, వి ఆర్ ఓ నాగరాజ్ పంచాయతీ కార్యదర్శి చంద్ర ,గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దాసరి వెంకటేశ్వరరావు జనసేన బాపట్ల మండల అధ్యక్షులు దాసరి ఏసుబాబు టిడిపి నాయకులు బొమ్మల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## హెూలీ పండుగ ఎటువంటి సంఘటనలు
## జరగకుండా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ దూడి




శుభోదయం న్యూస్, బాపట్ల జిల్లా: జిల్లా ఎస్పీ హెూలీ పండుగ సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు..జిల్లా ప్రజలకు అధికారులకు హెూలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా ఎస్పీ తుషార్ దూడి..బాపట్ల జిల్లా లో హెూలీ పండుగ పురస్కరించుకొని ఇతరులకు ఇబ్బంది కలగకుండా పండగను జరుపుకోవాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలను ప్రేరేపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు..

## దోర్నాల మండలం
## ప్రజలందరికీ హెూలీ పండుగ శుభాకాంక్షలు



దోర్నాల మండలం రిపోర్టర్-(శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం మత సామరస్యం పాటిస్తూ సంతోషకర వాతావరణంలో హెూలీ పండుగ జరుపుకోవాలని. హెూలీ పండుగ రోజు సాంప్రదాయ ఉపయోగము ఆరోగ్యకరము అని పెద్ద దోర్నాల ఎస్సై వి మహేష్ అన్నారు. ఎదుటివారి మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించవద్దు అన్నారు. ఇబ్బంది కలిగించవద్దు. మహిళల పట్ల మర్యాదగా ఉండాలి అని వివరించారు. ప్రధాన కూడలి కాలనీలు రహదారులపై సీసీ కెమెరాలు ఉండటముతో పాటు డ్రోన్లు వినియోగిస్తున్నాము అన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం లేదా ఏవేని సమస్యలకు కారణమైతే అట్టి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవు అన్నారు. భద్రతలకు విఘాతం కలిగించకుండా ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించకుండా ఇతరులకి ఇబ్బంది కలిగించకుండా పండుగ జరుపుకోవాలని ఎస్ ఐ వి మహేష్ తెలిపారు. సాంప్రదాయ పండుగలు ఏవైనా ప్రజలు కలిసి మెలసి ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వి మహేష్ తెలిపారు.

## అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ డే





దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా దోర్నాల మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నందు అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ 'డే' ను డాక్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది . దోర్నాల ల్యాబ్ టెక్నీషియన్ చిరంజీవి ని సన్మానించి అనంతరం కేక్ కటింగ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ మెర్సీ, డాక్టర్ లావణ్య మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

## పేదల గృహ నిర్మాణాల కోసం అదనపు ఆర్థిక సహాయం



డోన్, (శుభోదయం న్యూస్):: డోన్ మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ఏ ఈ వీరేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఏ ఈ వీరేంద్ర మాట్లాడుతూ ఎస్సీ,బీసీ, ఎస్టీ, పివిటిజి లకు గృహాలు మంజూరై ఇంకను వివిధ దశల్లో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేయడానికి అదనపు ఆర్థిక సహాయం అందించేందుకు అనుమతిస్తూ జిఓఆర్ టి నంబర్ 9 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంలో భాగంగా 2029 నాటికి 'అందరికీ ఇళ్లు' నిర్మించాలనే లక్ష్యంలో భాగంగా అసంపూర్తి నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేయడానికి అదనపు ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఇళ్లు మంజూరై ఇంకనూ వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న ప్రస్తుత యూనిట్ విలువ 1.80 లక్షల రూపాయలకు అదనంగా ఎస్సీలకు 50 వేలు, బీసీలకు 50 వేలు, ఎస్టీలకు 75 వేలు, పివిటీజీలకు లక్ష రూపాయలు చొప్పున అదనపు సాయం అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. దీంతోపాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు 35 వేల రూపాయల నుండి లక్ష రూపాయల వరకు రుణం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని గృహ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ప్రశ్నార్థకంగా 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు



న్యూఢిల్లీ : పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలతో ఆరు రాష్ట్రాల్లోని 85 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీలు "క్రమబద్ధమైన వైఫల్యమని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు తమ మధ్యనున్న విభేదాలను పక్కనపెట్టి కఠిన చర్యలు తీసుకున్నప్పుడే "తీవ్రమైన సమస్య" పరిష్కారమౌతుందని అన్నారు. పేపర్ లీకేజీ యువతకు ప్రమాదకరమైన పద్మవ్యూహంగా మారిందని గురువారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. కష్టపడి చదివే విద్యార్థులను, వారి కుటుంబాలను ఈ లీకేజీలు అనిశ్చితిలోకి నెడుతున్నాయని, తీవ్రమైన ఒత్తిడి కలిగిస్తున్నాయని అన్నారు. కష్టానికి తగిన ఫలితం లేకపోతే.. కష్టపడి పనిచేయడం కంటే నిజాయితీ లేకపోవడమే మంచిదనే తప్పుడు సందేశం తరువాతి తరానికి వెళ్తుందని అన్నారు. ఇది ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. దేశాన్ని కుదిపేసిన నీట్ పేపర్ లీక్ వ్యవహారానికి ఏడాది కూడా కాలేదని, ఈ అంశంపై తీవ్రమైన నిరసనలు చేపట్టామని అన్నారు., నిరసనల తర్వాత మోడీ ప్రభుత్వం ఒక కొత్త చట్టం పేరుతో దాక్కుందని, ఇదే పరిష్కారమని ప్రక టించి చేతులు దులుపుకుందని అన్నారు. కానీ ఇటీవలి లీకేజీలు ఆ చట్టం వైఫల్యాన్ని నిరూపించాయని అన్నారు. పరీక్షలు విద్యార్థుల హక్కు, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనైనా కాపాడుకోవాలని స్పష్టం చేశారు.

## కర్స్క్‌ను సందర్శించిన పుతిన్ .. సైనిక దుస్తుల్లో పర్యటన



మాస్కో : రష్యా అధ్యక్షుడు పుతిన్ బుధవారం సైనిక దుస్తుల్లో కర్స్క్ సందర్శించారు. కర్స్క్ పశ్చిమప్రాంతం నుండి వీలైనంత త్వరగా ఉక్రెయిన్ దళాలను తరిమికొట్టాలని ఉన్నత కమాండర్లను ఆదేశించారు. బుధవారం కర్స్క్ చేరుకున్న ఆయన అక్కడ టెలివిజన్ ప్రసంగంలో పేర్కొన్నారు. 30 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిగణించాల్సిందిగా అమెరికా కోరిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణకు రష్యా అంగీకరిస్తుందని ఆశిస్తున్నామని, లేకుంటే రష్యాను ఆర్థికంగా దెబ్బతీయవచ్చని అమెరికా బెదిరింపులకు దిగడంతో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సమీప భవిష్యత్తులో సాధ్యమైనంత తక్కువ సమయంలో కర్స్క్ ప్రాంతంలో స్థిరపడిన శత్రువును నిర్ణయాత్మకంగా ఓడించడమే తమ కర్తవ్యమని అన్నారు. వాస్తవానికి సరిహద్దుల వెంబడి భద్రతను కట్టుదిట్టం చేయడం గురించి ఆలోచించాలని అన్నారు. కర్స్క్‌లో ఒకప్పుడు ఆక్రమించుకున్న 86శాతం భూభాగం కంటే ఎక్కువ భూభాగం నుండి తమ సైన్యం ఉక్రెయిన్ దళాలను బయటకు నెట్టాయని రష్యా జనరల్ స్టాఫ్ చీఫ్ వాలెరీ గెరాసిమోవ్ పేర్కొన్నారు. కాల్పుల విరమణ కోసం జరిగే చర్చల్లో కర్స్క్‌ను పావుగా ఉపయోగించుకోవాలన్న ఉక్రెయిన్ ప్రణాళిక విఫలమైందని అన్నారు. గత ఐదురోజుల్లో రష్యన్ దళాలు ఉక్రెయిన్ సైన్యం నుండి 24 స్థావరాలను, 259 చదరపు కిలోమీటర్ల భూమిని, 400 మందికి పైగా ఖైదీలతో సహా తిరిగి స్వాధీనం చేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ట్రంప్ దయ పొందేందుకే స్టార్‌లింక్‌తో భాగస్వామ్యం



న్యూఢిల్లీ : స్టార్‌లింక్‌తో ఎయిర్‌టెల్, రిలయన్స్ జియో భాగస్వామ్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ గురువారం ప్రధాని మోడీకి పలు ప్రశ్నలు సంధించారు. ఈ ఒప్పందాలను ఎలన్ మస్క్ ద్వారా అమెరికా అధ్యక్షులు ట్రంప్‌కు అనుకూలంగా మలిచేందుకు ప్రధాని మోడీ కుట్ర పన్నారని అన్నారు. "అక్షరాలా 12 గంటల్లోనే ఎయిర్‌టెల్ మరియు జియో రెండూ స్టార్‌లింక్‌తో భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. దీంతో భారతదేశంలోకి స్టార్‌లింక్ సులభంగా ప్రవేశించగలిగింది. అయితే గత కొంతకాలంగా వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలన్నింటినీ పక్కకు పెట్టి ఈ ఒప్పందం చేసుకోవడం గమనార్హం. స్టార్‌లింక్ యజమాని ఎలమన్ మస్క్ ద్వారా ట్రంప్ దయ పొందేందుకు ప్రధాని మోడీ స్వయంగా ఈ భాగస్వామ్యాలను ఏర్పాటు చేశారనేది స్పష్టంగా తెలుస్తుంది" అని అన్నారు. కానీ చాలా ప్రశ్నలకు ప్రధాని మోడీ సమాధానమివ్వాల్సి వుందని స్పష్టంచేశారు. ఈ ఒప్పందంతో జాతీయ భద్రత పరిస్థితి ఏమిటని ప్రధానిని ప్రశ్నించారు. క్లిష్టమైన పరిస్థితుల్లో కనెక్టివిటీని స్టార్ లింక్ లేదా భారతీయ భాగస్వాములైన ఎయిర్‌టెల్, జియో సంస్థలు నియంత్రిస్తాయా ? ఇతర ఉపగ్రహ ఆధారిత కనెక్టివిటీ ప్రొవైడర్లు భారత్‌లోకి ప్రవేశించడానికి అనుమతిస్తారా అయితే ఏ నిబంధనలపై అనే దానిపై ఆందోళన లేవనెత్తారు. స్టార్‌లింక్ ప్రవేశంతో భారతదేశంలో టెస్లా తయారీ ప్రణాళికలకు మధ్య ఏదైనా సంబంధం ఉందా? అని ప్రధాని మోడీని నిలదీశారు.

## తమిళనాడు ప్రజలను, పెరియార్‌ను కేంద్రం అవమానించింది



చెన్నై : తమిళనాడు ప్రజలను, పెరియార్‌ను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని తమిళనాడు డిప్యూటీ సిఎం ఉదయనిధి స్టాలిన్ గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైతే తమను అనాగరికులమని విమర్శించారో వారికి రాష్ట్ర ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. "కేంద్ర ప్రభుత్వం తమిళనాడును, పెరియార్‌ను అవమానిస్తోంది. మనం అనాగరికులమా ? వాస్తవానికి మమ్మల్ని అనాగరికులమని పిలిచేవారే అనాగరికులుగా ప్రవర్తిస్తున్నారు. మాకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. తమిళ ప్రజలు త్వరలోనే తగిన సమాధానం ఇస్తారు" అని అన్నారు. తమిళనాడు అధికార డిఎంకె ఒకప్పుడు తమిళాన్ని అనాగరిక భాషగా కొట్టిపారేసిన వ్యక్తిని ఆరాధిస్తోందని కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షులు విజయ్ స్పందించిన సంగతి తెలిసిందే. తమపై విమర్శలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటికీ పెరియర్ రామస్వామి పేరును వాడుకుంటోందంటే తమిళనాడులో ఆయన్ను ఇప్పటికీ ఎంతగా ఆరాధిస్తున్నారో,ఆయనతో ఎంతగా అనుబంధం కలిగివున్నారో అర్థమౌతోందని విజయ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.

# గాయాన్ని గంటల్లో మాన్పే మాయా చర్మం



అది చర్మం కాని చర్మం. అయితే అలాంటిలాంటి చర్మం కాదు. గాయాలను శరవేగంగా నయం చేసే చర్మం! ఎంతటి గాయాన్నయినా నాలుగే గంటల్లో 90 శాతం దాకా మాన్పుతుంది. 24 గంటల్లో పూర్తిగా నయం చేసేస్తుంది. వినడానికి ఏదో సైంటిఫిక్ థ్రిల్లర్ సినిమా కథలా అన్పిస్తున్నా అక్షరాలా నిజమిది. ఈ మాయా చర్మం అందుబాటులోకి వస్తే వైద్యచికిత్స కొత్తపుంతలు తొక్కడం ఖాయమని చెబుతున్నారు. అచ్చం చర్మాన్ని తలపించే కొత్త రకం హైడ్రోజెల్‌ను రూపొందించడంలో సైంటిస్టులు విజయవంతమయ్యారు. చర్మానికి ఉండే స్వీయచికిత్స సామర్థ్యాన్ని ఇది ఎన్నో రెట్లు పెంచుతుందట. ఫిన్లండ్‌లోని ఆల్టో యూనివర్సిటీ, జర్మనీలోని బైరెట్ వర్సిటీలకు చెందిన పరిశోధకులు దీన్ని రూపొందించారు. నిజానికి ఇటువంటి విప్లవాత్మక ఆవిష్కరణ కోసం ప్రపంచవ్యాప్తంగా చాలా ఏళ్లుగా తీవ్రస్థాయిలో ప్రయత్నాలు జరుగుతూనే వస్తున్నాయి. కానీ అవేవీ ఇప్పటిదాకా అంతగా విజయవంతం కాలేదు. చర్మం తాలూకు విలక్షణతే అందుకు కారణం. సాగే లక్షణం, దీర్ఘకాలిక మన్నిక, తీవ్ర ప్రతికూల పరిస్థితులను తట్టుకోగల సామర్థ్యం వంటి ఎన్నో ప్రత్యేకతలు చర్మం సొంతం. వీటన్నింటినీ మించి గాయాలను తనకు తాను నయం చేసుకునే సాటిలేని సామర్థ్యం చర్మానికి ఉంది. ఇన్ని లక్షణాలతో కూడిన కృత్రిమ చర్మం రూపకల్పన ఇన్నేళ్లుగా సైంటిస్టులకు సవాలుగానే నిలిచింది. తాజాగా రూపొందించిన హైడ్రోజెల్ మాత్రం పూర్తిగా చర్మం లక్షణాలను కలిగి ఉంటుంది. కాలిన, తెగిన గాయాలపై ఈ జెల్‌ను అమరిస్తే వాటిని చిటికెలో నయం చేస్తుంది. తర్వాత దాన్ని తొలగించవచ్చు. లేదంటే క్రమంగా అదే కరిగిపోతుంది.

### ఇలా సాధించారు...

అతి పలుచనైన నానోషీట్‌తో రూపొందించిన పాలిమర్ సాయంతో కృత్రిమ చర్మం రూపకల్పన సాధ్యపడింది. మోనోమర్ పొడిని నీటితో కూడిన నానోషీట్లతో చాకచక్యంగా కలపడం ద్వారా అధ్యయన బృందంలోని శాస్త్రవేత్త చెన్ లియాంగ్ దీన్ని సాధించారు. తర్వాత ఈ మిశ్రమాన్ని యూవీ రేడియేషన్‌కు గురిచేయడంతో అందులోని అణువుల మధ్య ఆశించిన స్థాయిలో బంధం సాధ్యపడింది. ఫలితంగా చక్కని సాగే గుణమున్న చర్మంలాంటి హైడ్రోజెల్ రూపొందించింది. "అత్యంత హెచ్చు సామర్థ్యంతో కూడిన వ్యవస్థీకృత నిర్మాణం దీని సొంతం. హైడ్రోజెల్‌కు ఇది గట్టిదనం ఇవ్వడమే గాక గాయాల వంటివాటిని తనంత తానుగా నయం చేసుకోగల సామర్థ్యాన్ని కూడా కట్టబెట్టింది" అని అధ్యయన బృందం పేర్కొంది. "జీవకణాలు చూసేందుకు గట్టిగా ఉన్నా స్వీయచికిత్స సామర్థ్యంతో కూడి ఉంటాయి. సింథటిక్ హైడ్రోజెల్‌లో ఈ లక్షణాలను చొప్పించడం ఇప్పటిదాకా సవాలుగానే నిలిచింది. దాన్నిప్పుడు అధిగమించాం" అని వివరించింది. కృత్రిమ చర్మ పరిజ్ఞానంలో ఇది మైలురాయిగా నిలుస్తుందని పేర్కొంది. "కాలిన, దీర్ఘకాలిక గాయాలను సత్వరం నయం చేయడం ఇకపై మరింత సులువు కానుంది. అంతేగాక వైద్య చికిత్సలోనే గాక ప్రోస్తటిక్స్, సాఫ్ట్ రోబోటిక్స్ తదితర రంగాల్లో కూడా ఇది ఉపయుక్తం కానుంది" అని వివరించింది. మిల్లీమీటర్ మందంలోని జెల్‌లో దాదాపు 10 వేల నానోషీట్లుంటాయి. ఫలితంగా దానికి గట్టిదనంతో పాటు సాగే గుణం కూడా ఉంటుంది. ఈ మిరాకిల్ జెల్ ప్రస్తుతానికి ప్రయోగ దశలోనే ఉంది. వైద్యపరంగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు మరో ఐదేళ్లకు పైగా పట్టవచ్చు. అధ్యయన వివరాలు ప్రతిష్టాత్మక జర్నల్ నేచర్ మెటీరియల్ తాజా సంచికలో ప్రచురితమయ్యాయి.

### ఏమిటీ హైడ్రోజెల్

సింపుల్‌గా చెప్పాలంటే ఇది జెల్ వంటి మృదువుగా ఉండే పదార్థం. దీన్ని పాలిమర్ తదితర మెటీరియల్స్‌తో తయారు చేస్తారు. వెంట్రుకల చికిత్స మొదలుకుని ఆహారోత్పత్తుల దాకా దాదాపు అన్నింట్లోనూ వీటిని విస్తృతంగా వాడుతున్నారు.

# నెత్తురోడుతున్న బలూచిస్తాన్





ఒక ప్రాంత ప్రజల ఆకాంక్షలను ఉక్కుపాదంతో అణచాలని చూస్తే... దాని అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి అక్కడి వనరులను పీల్చిపిప్పి చేస్తే... ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక రూపంలో ఆగ్రహజ్వాలలు ఎగిసిపడతాయి. విభజనానంతరం పాకిస్తాన్ ఒక దేశంగా ఏర్పడినప్పుడు అందులో విలీనం కాకుండా తాము స్వతంత్రంగా ఉంటామని కరాత్ సంస్థానం ప్రకటించినప్పుడు నూతన పాలకులు ససేమిరా అంగీకరించలేదు. అక్కడి వనరులపై కన్నేసిన పాలకులు ఆ సంస్థానాన్ని నమ్మించి, స్నేహ ఒడంబడిక కుదుర్చుకుని చివరకు దాన్ని బుట్టదాఖలా చేశారు. ఈ ద్రోహం వెనక పాక్ జాతిపిత మహమ్మదాలీ జిన్నాతోసహా పలువురున్నారు. దాని పర్యవసానాలు ఈ ఏడున్నర దశాబ్దాలుగా ఆ దేశం అనుభవిస్తూనే ఉంది. క్వెట్టానుంచి పెషావర్ వెళ్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) మిలిటెంట్లు హైజాక్ చేసి వందలమందిని అపహ రించుకు పోవటం, కొందరిని హతమార్చటం ఆ వరసలో మరో చర్య. బుధవారం భద్రతా దళాలను రంగంలోకి దింపి దాదాపు 200 మంది ప్రయాణికులను విడిపించినట్టు చెబుతున్నారు. ఇందుకు ప్రతిగా 50 మంది బందీలను మిలిటెంట్లు హతమార్చగా, ఆ తర్వాత మిలిటెంట్లందరినీ పాక్ సైన్యం మట్టుబెట్టిందంటున్నారు. ఇలా నిత్యం నెత్తురోడుతున్న బలూచిస్తాన్ భౌగోళికంగా పాకిస్తాన్‌లోనే ఉన్నా, అక్కడివారు తమను తాము పాకిస్తానీలుగా పరిగణించుకోరు. ఒకనాడు సాధారణ సమస్యల కోసం ఉద్యమించినవారు ఇప్పుడు స్వాతంత్ర్యాన్ని కోరుకునేదాకా వచ్చారు. పాక్ పాలకుల నిర్వాకమే ఇందుకు కారణం. బలూచిస్తాన్ సాధారణ ప్రాంతం కాదు. ఇక్కడి భూమిలో బంగారం, వజ్రాలు, వెండి, రాగి వనరులు నిక్షిప్తమైవున్నాయి. దేశ వర్తక, వాణిజ్యాలను అత్యున్నత స్థాయికి తీసుకుపోగల డీప్ సీ పోర్టు ఉన్న గ్వాదర్ కూడా ఇక్కడిదే. 2002లో ఈ ఓడరేవు తొలి దశలో కొంత భాగాన్ని పూర్తిచేసి ఆదరాబాదరాగా ప్రారంభించారు. కానీ ఆ తర్వాత పనులు పడకేశాయి. దీన్ని నిర్మిస్తున్న చైనా... స్థానికులకు నామమాత్రం అవకాశాలిచ్చింది. ఇది బలూచి వాసుల అసంతృప్తిని మరిన్ని రెట్లు పెంచింది. భౌగోళికంగా వైశాల్యంలో ఫ్రాన్స్‌ను పోలివుండే ఈ ప్రాంత జనాభా కేవలం 90 లక్షలు. ఇంత తక్కువ జనాభాతో, అపరిమితమైన వనరులతో ఉండే ఈ బలూచిస్తాన్ గత 77 ఏళ్లలో వాస్తవానికి అద్భుతమైన ప్రగతి సాధించివుండాలి. కానీ విషాదమేమంటే ఇక్కడున్న 70 శాతం మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో మగ్గుతుంటారు. వారికి ఉపాధి అవకాశాలుండవు.వేరేచోటకు వెళ్లి స్థిరపడేంత చదువుసంధ్యలుండవు. సైనిక దళాల్లో సైతం బలూచిస్తాన్ వాసులకు మొండిచేయి చూపారు. వారిపై పాక్ సైన్యాధికారుల్లో వున్న అపనమ్మకమూ, భయాందోళనలే అందుకు కారణం. తెలివైన పాలకులైతే ఆ ప్రాంతానికి స్వయంప్రతిపత్తినిచ్చి, దాని అభివృద్ధికి బాటలు పరిచే వారు. కానీ పాకిస్తాన్ పాలకులు అణచివేతే పరిష్కారం అనుకున్నారు. సైనిక పదఘట్టనలతో అది పాదాక్రాంతం అవుతుందనుకున్నారు. బలూచిస్తాన్‌లో తరచు మిలిటెంట్ దాడులకు పాల్పడే బీఎల్ఏ 2000 సంవత్సరంలో ఏర్పడినా అంతకు చాలాముందునుంచే ఉద్యమకారులను అపహరించి మాయం చేయటం, బూటకపు ఎన్ కౌంటర్లలో వారిని హతమార్చటం పాక్ సైన్యం ఒక పద్ధతిగా కొనసాగించింది. 2011 నుంచి లెక్కేసినా దాదాపు 10,000 మంది అదృశ్యమయ్యారని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ అంటున్నది. బీఎల్ఏ సైతం అదే మార్గం ఎంచుకుంది. మొదట్లో చెదురు మదురు ఘటనలకే పరిమితమైన ఆ సంస్థ ఇటీవలి కాలంలో భారీ దాడులకు పాల్పడుతోంది. బీఎల్ఏ కారణంగా చైనా%-%పాకిస్తాన్ కారిడార్ (సీపీఈసీ) అటకెక్కేలావుంది. చైనా ఖండాంతర ప్రాజెక్టు బెల్ట్ అండ్ రోడ్ ఇన్షియేటివ్(బీఆర్ఐ)లో సీపీఈసీ కీలకమైనది. కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న జాతీయ రహదారులనూ, ఇతర మౌలిక సదుపాయాలనూ బీఎల్ఏ లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేయటం ఇందుకే. 6,500 కోట్ల డాలర్ల విలువైన సీపీఈసీలో ఇంధనం, రవాణా, పారిశ్రా మిక కారిడార్లు, గ్వాదర్ పోర్టు వగైరాలున్నాయి. స్థానికులకు అవకాశాలీయకుండా ఇంత పెద్ద నిర్మాణాన్ని తలకెత్తుకుంటే అసంతృప్తి రాజుకుంటుందన్న ఇంగితజ్ఞానం పాలకులకు కొరవడింది. బలూచిస్తాన్ వాసుల డిమాండ్లు ధర్మమైనవి. కానీ అందుకు హింసాత్మక మార్గాన్ని ఎంచుకోవటంవల్ల న్యాయమైన సమస్య మరుగున పడుతుంది. బలూచిస్తాన్‌లో జాతి, మత, తెగ, రాజకీయ విశ్వాసాలతో నిమిత్తం లేకుండా మానవ హక్కుల కోసం పోరాడే బలూచ్ యక్‌జహితీ కమిటీ (బీవైసీ) 2019 నుంచీ పనిచేస్తోంది. ఆ సంస్థ నాయకురాలు డాక్టర్ మెహ్రాంగ్ బలూచ్‌కు అన్ని వర్గాల నుంచీ అపారమైన ఆదరణ వుంది. పాక్ సైన్యం ఆగడాల కారణంగా తండ్రి అదృశ్యం కావటం, చాన్నాళ్ల తర్వాత ఛిద్రమైన ఆయన మృతదేహం లభ్యం కావటం ఆమె పట్టుదలను మరింత పెంచాయి. నిరుడు ఆగస్టులో డాక్టర్ మెహ్రాంగ్ గ్వాదర్‌లో తలపెట్టిన ర్యాలీయే దీనికి రుజువు. సైన్యం ఎన్ని అడ్డంకులు కల్పించినా అది విజయవంతమైంది. శాంతియుతంగా జరిగిన ఆ ర్యాలీలో పాల్గొన్నారన్న కక్షతో డజన్లకొద్దీమందిని అరెస్టు చేస్తే దానికి నిరసనగా 12 రోజుల పాటు ధర్నా సాగించి వారిని విడిపించుకున్న చరిత్ర బీవైసీది. అణచివేత ధిక్కారానికి దారి తీస్తుంది. దాన్ని ఉపేక్షిస్తే తిరుగుబాటుకు బాటలు పరుస్తుంది. ప్రజల మౌలిక ఆకాంక్షలను బేఖాతరు చేస్తే ఎంత శక్తిమంతమైన రాజ్యానికైనా భంగపాటు తప్పదు. బలూచిస్తాన్ ప్రజలు దాన్నే చాటుతున్నారు.

# ముంచుకొస్తున్న కాలుష్య ముప్పు



దేశం కాలుష్య కాసారంగా మారుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. స్విస్ ఎయిర్ టెక్నాలజీకి చెందిన ప్రతిష్టాత్మక సంస్థ 'ఐక్యు ఎయిర్' తాజాగా విడుదల చేసిన 'ది వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్-2024' ప్రకారం ప్రపంచంలోని ఇరవై అత్యంత కాలుష్య నగరాల్లో పదమూడు మన దేశంలోనే ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధాని నగరంగా ఢిల్లీ కొనసాగుతూనే ఉంది. అస్సాం -మేఘాలయ సరిహద్దుల్లోని బైర్నిహాట్ పట్టణం వాయు కాలుష్యంలో ఢిల్లీని మించిపోయి, అత్యంత కాలుష్య నగరాల జాబితాలో ప్రపంచంలోనే మొట్టమొదటి స్థానంలో నిలవడం మరింత ఆందోళనకరం! మేఘాలయకు చెందిన ఈ చిన్న నగరంలో అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా పరిశ్రమలు ఏర్పాటు చేయడమే ఈ పరిస్థితికి కారణం.ఈ నివేదిక ప్రకారం ఆస్ట్రేలియా, న్యూజి లాండ్, బహమాస్, బార్బడోస్, గ్రెనడా, ఎస్టోనియా, ఐస్‌లాండ్ దేశాలు మాత్రమే ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాల మేరకు వాయు కాలుష్యాన్ని నియంత్రించగలిగాయి. భారత్ 2023తో పోలిస్తే అత్యధిక కాలుష్య ర్యాంకుల్లో మూడవ స్థానం నుండి ఐదవ స్థానానికి చేరి కొంత మెరుగైన ఫలితాలు సాధించినట్టు నివేదిక పేర్కొంది. పి.ఎం 2.5 స్థాయిని ఏడు శాతానికి తగ్గించగలిగింది. అయినప్పటికీ, పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల సరసన డేంజర్ జోన్‌లోనే కొనసాగుతుండటం,

కాలుష్య నగరాల సంఖ్య పెరుగుతుండటం పొంచి ఉన్న ముప్పునకు నిదర్శనం. చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ 2023లోనే కాలుష్య స్థాయి ఇదే మాదిరి కొనసాగితే ఢిల్లీ ప్రజానీకం తమ జీవితకాలంలో 11.9 సంవత్సరాలు కోల్పోతారంటూ హెచ్చరిక చేసింది. ఆ నివేదిక ప్రకారం ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన మార్గదర్శకాలకు మించిన కాలుష్యంలో దేశంలోని మొత్తం జనాభా మగ్గుతోంది. ప్రతి క్యూబిక్ మీటర్‌కు నలభై మైక్రో గ్రాముల కాలుష్యానికి అనుమతి ఇస్తూ మన దేశం రూపొందించుకున్న సొంత నాణ్యతా ప్రమాణాలు సైతం ఆచరణలో అమలు కావడం లేదు. జాతీయ పరిమితి కన్నా అధికంగా కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో దేశంలోని 67.4 శాతం జనాభా జీవనం సాగిస్తోంది. 2023లోనే విడుదలైన 'ది లాన్‌సెట్ ప్లానెటరీ హెల్త్' నివేదిక ప్రకారం మన మహానగరాలన్నీ వాయు కాలుష్యంతో అతలాకుతల మౌతున్నాయి. కాలుష్యంతో నిండిన గాలిని పీల్చడం ద్వారా దేశం మొత్తం మీద ప్రజానీకం సగటున 5.2 సంవత్సరాల జీవితాన్ని కోల్పో తున్నారు. వాయు కాలుష్య సంబంధిత రోగాల ద్వారా ప్రతి సంవత్సరం పదిహేను లక్షల మంది మరణిస్తున్నారు. దేశ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న వాటిలో వాయు కాలుష్యం ఐదవ స్థానంలో నిలుస్తోంది. ఈ కారణంగా ఢిల్లీలో 50 శాతం మంది చిన్నారుల ఊపిరితిత్తులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంది కాబట్టే 2019 నవంబర్‌లో అత్యున్నత న్యాయస్థానం 'నరకానికన్నా అధ్వాన్నంగా ఢిల్లీ నగరం తయారైంది' అని వ్యాఖ్యానించింది. ఆ సమయంలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రా 'పేలుడు పదార్థాలు అమర్చి ప్రతి ఒక్కరినీ చంపేయడం మంచిది.' అని అన్నారంటే అప్పటికే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అయినా, పాలకులలో స్పందన లోపించడంతో, ఆ దుస్థితి దేశమంతా విస్తరిస్తోంది. వాయు కాలుష్యానికి, వాతావరణ మార్పులకు దగ్గర సంబంధం ఉన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ల పేరుతో కార్పొరేట్లకు ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు దేశ వ్యాప్త వాయు కాలుష్యంలో యాభై ఒక్క శాతానికి పరిశ్రమలు వెదజల్లే విష వాయువులే కారణమని తేలినా నియంత్రణకు చర్యలు తీసు కోవడం లేదు, ప్రజా రవాణా వ్యవస్థను మెరుగు పరచడం ద్వారా వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ స్పందన శూన్యం.కార్పొరేట్ల లాభాల కోసం సామాన్యుల ప్రాణాలను సమిధలుగా చేసే ఈ తరహా విధానాలను ప్రభుత్వాలు ఇప్పటికైనా విడనాడాలి. తక్షణం కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి. అడవులను పరిరక్షించడంతో పాటు, వీలైన అన్ని ప్రాంతాల్లోనూ చెట్లను పెంచాలి. ఈ తరహా చర్యలే కాలుష్య కోరల నుండి ప్రజానీకాన్ని కాపాడుతాయి.

## డబ్ల్యుఎఫ్ఐ సస్పెన్షన్ రద్దుపై స్పందించిన వినేష్ ఫోగట్



న్యూఢిల్లీ : క్రీడాశాఖ భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) సస్పెన్షన్‌ను రద్దు చేయడంపై మాజీ రెజ్లర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేష్ ఫోగట్ స్పందించారు. సస్పెన్షన్ రద్దు తనను ఆందోళనకు గురిచేసిందని అన్నారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ సంజయ్ సింగ్ ఒక డమ్మీ అని, బ్రిజ్ భూషణ్ వెనుక ఉండి రెజ్లింగ్‌ను నడిపిస్తున్నారని అన్నారు. హర్యానా అసెంబ్లీలో గురువారం గవర్నర్ ప్రసంగంపై చర్చ సందర్భంగా ఇటీవల జులానా నియోజకవర్గం నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వినేష్ ఫోగట్ మాట్లాడారు. ప్రస్తుతం తాను గర్వంతో, బాధతో ఇక్కడ ఉన్నానని అన్నారు. తమ ప్రభుత్వం క్రీడల అభివృద్ధి కోసం ఎంతో చేసిందని పలువురు ఎంపిలు, ఎమ్మెల్యేలు చెబుతున్నారని అన్నారు. రెండు సంవత్సరాలుగా వీధుల్లో ఆందోళనలు చేపట్టామని, ఇప్పటికీ రెజ్లింగ్ క్రీడను కాపాడుకునేందుకు పోరాడుతున్నామని బాధతో చెబుతున్నానని అన్నారు. కానీ రెండు రోజుల క్రితం మీ పార్టీ (బిజెపి) రెజ్లింగ్‌ను తిరిగి అతని చేతుల్లో పెట్టిందని బ్రిజ్‌భూషణ్ పేరు ప్రస్తావించకుండా అన్నారు. ప్రస్తుతం తాను కాంగ్రెస్ ఎమ్మెల్యే అయినప్పటికీ.. బ్రిజ్‌భూషణ్‌కి వ్యతిరేకంగా ఏ పార్టీ ప్రతినిధులుగా తాము ఆందోళనను ప్రారంభించలేదని, క్రీడాకారులుగానే తమ గొంతుకను వినిపించామని అన్నారు. ఒక క్రీడాకారుడు ఎప్పటికీ క్రీడాకారుడిగానే ఉంటారని స్పష్టం చేశారు. వర్ధమాన క్రీడాకారుల భవిష్యత్తు కోసం తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించాలని హర్యానా ప్రభుత్వాన్ని కోరారు.

# పెరియార్ ఆరాధ్యనీయుడు

### నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలను ఖండించిన విజయ్




చెన్నై : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తమపై విమర్శలను కప్పిపుచ్చుకోవడానికి ఇప్పటికి కూడా పెరియార్ రామస్వామి పేరును వాడుకుంటోందంటే తమిళనాడులో ఆయన్ను ఇప్పటికీ ఎంతగా ఆరాధిస్తున్నారో.. ఆయనతో ఎంతగా అనుబంధం కలిగివున్నారో వెల్లడిస్తుందని ప్రముఖ నటుడు, తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షులు విజయ్ పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ విజయ్ ఎక్స్‌లో ఈ మేరకు పోస్టు చేశారు. తమిళం ఒక అనాగరిక భాష అని పెరియార్ చెప్పినట్లుగా ఆర్థిక మంత్రి పేర్కొన్నట్లు కథనాలు వచ్చాయి. ఇదే విషయాన్ని విజయ్ ప్రస్తావిస్తూ 'ఈ విషయంపై నిజంగా మంత్రి ఆందోళన చెందుతున్నారా..? అని ఆయన ప్రశ్నించారు. తమిళంపై అంత మమకారం నిజంగా ఆమెకు ఉంటే తమిళనాడుపై త్రిభాషా విధానాన్ని రుద్దడాన్ని ఎందుకు ఆపలేకపోతున్నారు..?' అని విజయ్ ప్రశ్నించారు. తన వరకూ.. వితంతు పునర్వివాహాలకు మద్దతు ఇవ్వడం, బాల్య వివాహాలు, కుల ఆధారిత అణచివేతలను వ్యతిరేకించడం.. వంటి అనేక కారణాలతో తమిళనాడులో పెరియార్‌ను ఆరాధిస్తున్నారని విజయ్ తెలిపారు.

## నేను ఏం మాట్లాడానో చెప్పాలి: జగదీశ్ రెడ్డి



హైదరాబాద్: సభను ఆర్డర్‌లో పెడితేనే తాను మాట్లాడుతానని బిఆర్ఎస్ ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి తెలిపారు. స్పీకర్ అధికారం గురించి మాట్లాడాలనుకున్నానని పేర్కొన్నారు. సభ సంప్రదాయాలు తేలడంతో పాటు స్పీకర్ అధికారులు తేలాలన్నారు. సభ్యుల హక్కులు తేలాలి, అన్నీ తేలాకే తాను మాట్లాడుతానని వివరణ ఇచ్చారు. శాసన సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై చర్చ జరిగిన సందర్భంగా జగదీశ్ రెడ్డి మాట్లాడారు.'ఈ సభ అందరిది, అందరికీ సమాన హక్కులు ఉన్నాయి, మా అందరి తరపున పెద్దమనిషిగా స్పీకర్‌గా మీరు కూర్చొన్నారు, ఈ సభ మీ సొంతం కాదు' అని జగదీశ్ రెడ్డి చురకలంటించారు. తన విషయంలో సభా సంప్రదాయాలకు విరుద్ధంగా స్పీకర్ మాట్లాడారనడం మంచిది కాదు అని హితువు పలికారు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా ఏం మాట్లాడానో చెప్పాలని నిలదీశారు. స్పీకర్‌ను ప్రశ్నించడం సభా సంప్రదాయాలకు విరుద్ధం కాదని ధ్వజమెత్తారు. స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.

## ఏపీ హైకోర్టులో పోసాని కృష్ణమురళికి ఊరట



అమరావతి: ఏపీ హైకోర్టులో పోసాని కృష్ణమురళికి ఊరట లభించింది. తనపై బాపట్ల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసును క్వాష్ చేయాలంటూ హైకోర్టులో పోసాని పిటిషన్ దాఖలు చేశారు. లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. బిఎన్ఎస్35(3) సెక్షన్‌ను ఫాలో కావాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. కాగా, పోసానిని సీఐడీ పోలీసులు నిన్న (బుధవారం) రాత్రి( గుంటూరులో ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఇంటి వద్ద హాజరు పరిచారు. ఈ సందర్భంగా పోసాని అనారోగ్య సమస్యల గురించి విన్నవించుకున్నారు. బెయిల్ రాకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని పోసాని కృష్ణమురళి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులకు సంబంధించి తనకు ఎటువంటి పాపం తెలియదని, తానేం చేయలేదని న్యాయమూర్తి ఎదుట బోరున విలపించారు. నిజం మాట్లాడినందుకు తన మీద కక్ష కట్టి ఇలాంటి అన్యాయమైన కేసులు పెట్టారని విన్నవించారు. తల్లి మీద, పిల్లల మీద ఒట్టేసి చెబుతున్నానని తనకే పాపమూ తెలియదని న్యాయమూర్తిని వేడుకొన్నారు. బెయిల్ ఇవ్వాలని కోరారు. వయసు మీదపడడంతో కూర్చోలేక పోతున్నానని చెప్పుకొచ్చారు. పోలీసులు ఎక్కడినుంచి ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియడం లేదని, ఇప్పటికే కొన్ని వందల మైళ్లు ప్రయాణం చేయించారని, ఎందుకు నన్ను తిప్పుతున్నారో అర్థం కావడం లేదని, ఇలా చేస్తే తాను ఎక్కువ రోజులు బతకనని మొరపెట్టుకున్నారు. టీడీపీలోకి రమ్మంటే రానందుకు లోకేశ్ తనను వేధిస్తున్నారని, నంది అవార్డుల ప్రకటనలో పక్షపాతాన్ని ఎత్తిచూపడంతో కక్ష కట్టారని తెలిపారు. అన్నీ నిజాలే చెబుతున్నానని నార్కో ఎనాలసిస్ టెస్టుకూ సిద్ధమన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఇన్ని కేసులు కడతారా అని ఆవేదన వ్యక్తం చేశారు.

# జలసంరక్షణ నీరుగారుతోంది!



జీవకోటికి నీరే ప్రాణాధారం.అందుకనే పంచభూతాల్లోనూ నీటికి ప్రాధాన్యమిచ్చారు. ఒకప్పుడు మంచినీటికి కొదవ ఉండేది కాదు. ఎక్కడబడితే అక్కడ జలసంపద సమృద్ధిగా అందుబాటులో ఉండేది. అందుకనే, ఎవరైనా డబ్బును దుబారా చేస్తుంటే మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేస్తున్నాడని పెద్దలు కోపగించుకునేవాళ్లు. కానీ ఇప్పుడా నానుడికి కాలం చెల్లిందనే చెప్పాలి. ప్రస్తుత పరిస్థితుల్లో కష్టపడితే డబ్బు దొరకవచ్చేమో గానీ, ఒక గ్లాసెడు నీళ్లు దొరికే పరిస్థితి లేదంటే అతిశయోక్తి కాదు, ఈ దుస్థితి ఏ ఒక్క ప్రాంతానికో, దేశానికో పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఇదే తీరు నెలకొని ఉంది. ఇక వేసవి వచ్చిందంటే, దాహార్తితో నోరు పిడచ కట్టుకుపోతున్నా, తాగేందుకు గుక్కెడు నీళ్లు కూడా దొరకని వైనం కళ్లెదుట కనబడుతూనే ఉంది. మన దేశంలో భూగర్భ జలాల వినియోగం అత్యధికం. అందుకు తగినట్లుగా భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు చేపడుతున్న చర్యలు శూన్యం. ప్రపంచవ్యాప్తంగా భూగర్భ జలాల్లో 25 శాతం వినియోగం ఇండియాలోనే జరుగుతోంది. ఇది అమెరికా, చైనాల వినియోగంతో సమానమని ఇండియా వాటర్ పోర్టల్ గణాంకాలు ఘోషిస్తున్నాయి. దేశవ్యాప్తంగా 65 శాతం నీటిపారుదల భూగర్భజలాల ద్వారానే జరుగుతోంది. గ్రామీణ నీటి సరఫరాలో 85 శాతం, పట్టణ నీటి సరఫరాలో 50 శాతం భూగర్భ జలాలపైనే ఆధారపడి కొనసాగుతున్నాయి. వర్షాలు లేక, వర్షాలు పడినా వెర్రితలలు వేస్తున్న పట్టణీకరణ పుణ్యమాని ఆ నీరు భూమిలోకి ఇంకే మార్గం లేక భూగర్భ జలాల మట్టం నానాటికీ తీసికట్టు నాగంభొట్లు చందంగా మారుతోంది. నైరుతి రుతుపవనాల సమయంలో వర్షపాతం ఆశించినంతగా లేకపోవడం, శీతాకాలంలో ఉష్ణోగ్రతలు వేసవిని తలపించేలా ఉండటంవంటి కారణాలవల్ల వ్యవసాయానికి నీటి వినియోగం ఎక్కువై, భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయని హైదరాబాద్‌కు చెందిన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్ జిఆర్ఐ) శాస్త్రవేత్తలు చేసిన ఒక అధ్యయనంలో తేలింది.అందుబాటులో ఉన్న భూగర్భ జలాలు సైతం తాగునీటి వినియోగానికి అనువైనవిగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. భూగర్భజలాలు సురక్షితం కాదని పలు సందర్భాల్లో శాస్త్రవేత్తలు జరిపిన అధ్యయనాల్లో తేలింది. సాధారణంగా లీటరు నీటిలో 1.5 మిల్లీగ్రాములకు మించి ఫ్లోరైడ్, 45 గ్రాములకు మించి నైట్రేట్ ఉంటే ఆ నీళ్లు తాగేందుకు పనికి రావు. కానీ దేశవ్యాప్తంగా 440 జిల్లాల్లో ఈ రసాయనిక పదార్థాలు పరిమితికి మించి ఎక్కువగా ఉన్నట్లు భూగర్భ జలాల ప్రామాణికత- 2024 వార్షిక నివేదిక హెచ్చరిస్తోంది. అంతెందుకు.. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు నైట్రేట్‌తో కలుషితమైనట్లు ఇదే నివేదిక కళ్లకు కట్టింది. ఇక భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఐదో స్థానంలో ఉన్నట్లు తేలడాన్ని బట్టి, ఈ మహమ్మారి ముప్పు ఇంకా తప్పలేదని తెలుస్తోంది. చెట్ల నరికివేతను, భూగర్భజలాల దుర్వినియోగాన్ని, ఇబ్బడిముబ్బడిగా సాగుతున్న బోర్ల తవ్వకాలను నిషేధించి, జలనిధులను పరిరక్షించే ఉద్దేశంతో సుమారు పాతికేళ్ల క్రితం రూపుదిద్దుకున్న వాల్టా చట్టం అమలులో నత్తనడక నడుస్తోంది. వాననీటిని భూగర్భంలోకి పంపి, జలమట్టాలను పెంచేందుకు ఉద్దేశించిన ఇంకుడుగుంతల తవ్వకాన్ని ప్రభుత్వాలు తప్పనిసరి చేసినా, పర్యవేక్షణ లోపంతో అసలు ఉద్దేశం నీరుగారుతోంది. వేసవి రాకముందే చేపట్టవలసిన చెరువుల పూడికతీత అటకెక్కింది. చెట్లు, వర్షాలు, భూగర్భజలాలు- ఈ మూడింటికీ గల అవినాభావ సంబంధాన్ని ప్రజలలోకి మరింత వేగంగా తీసుకువెళ్లేందుకు పాలకులు ప్రణాళికలు రచించకపోవడం కూడా ప్రస్తుత అనర్థాలకు ముఖ్య కారణంగా గోచరిస్తోంది. చెట్లు లేని చోట వర్షాలు పడటం, వానలు లేనప్పుడు భూగర్భజలాలు పెరగడం దుర్లభం. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, హరిత వనాల పెంపకానికి ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వర్షాకాలం ఆరంభంలో మొక్కల పెంపకాన్ని ఆర్భాటంగా చేపట్టే పాలకులు, ఆ తర్వాత సదరు మొక్కల పరిరక్షణపై దృష్టి సారించడం లేదు. వ్యవసాయానికి, గృహావసరాల వినియోగానికి నీటిని పొదుపుగా వాడుకోవడం ఎంతో ముఖ్యం. ఈ విషయమై ప్రజలను, ముఖ్యంగా నిరక్షరాస్యుల్ని చైతన్యవంతం చేసే కార్యక్రమాలు చేపట్టాలి. వీటిలో రైతులు, పరిశ్రమల యాజమాన్యాల్ని కూడా భాగస్వాముల్ని చేయాలి. వేసవి కాలం రాగానే హడావిడి చేసే నేతలూ, అధికార గణం ఏడాది పొడవునా నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, వాల్టా చట్టాన్ని పటుతరంగా అమలు చేయడం వంటి చర్యలు చేపడితే వేసవిలో ప్రజలకు తిప్పలు తప్పుతాయి.

# ప్రగతిబాటలో వడివడిగా అడుగులు




ప్రగతి పరుగుతో వికసిత్ భారత్ వైద్య పరిశోధనల నుండి అణ్వస్త్ర ప్రయోగాల వరకు భారత దేశం స్వయం స్వావలంబన దిశగా ప్రయాణిస్తున్నది. దేశం అభివృద్ధి చెంది 2047 నాటికి అభివృద్ధి ఫలాలు అందరికీ అందడమే వికసిత్ భారత్ ప్రగతికి అర్థం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో 5వ స్థానం. సైన్స్ పట్ల విశ్వాసంలో 2వ స్థానం. శాస్త్రీయ పరిశోధన పత్రాలలో 3వ స్థానం. వ్యవసాయ ఉత్పత్తులలో 8వ స్థానం. ప్రపంచ పర్యావరణ సూచిలలో 8వ స్థానం. రక్షణ వ్యయంలో 4వ స్థానం. విదేశీ మారక ద్రవ్య నిలవలలో 4వ స్థానం. స్పేస్ డాక్‌లో 4వ స్థానం. ప్రపంచ పర్యాటక అభివృద్ధిలో 39వ స్థానం. ప్రపంచ పోటీతత్వ సూచిలో 37వ స్థానం. నూతన ఆవిష్కరణలలో 40వ స్థానం. ఇంధన పరివర్తన సూచీలో 63 వ స్థానం. అందరికీ డిజిటల్ ఫలాలు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీని ఆకలింపు చేసుకుని యువత భారత్ సొంతం. 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 2047 నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న యువ భారత దేశం అభివృద్ధి చెందిన స్వర్ణ భారతదేశంగా వారసత్వ వికాసాన్ని వికసింప చేయాలని మన ప్రజాస్వామ్యంలో యువత చట్ట సభలలో శాసనాలను చేయడంలో ముందుండి ఆత్మనిర్భర్ దేశంగా మన దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టి భారత ప్రజాస్వామ్య దేశం ఆదర్శంగా కొనసాగుతున్నది. 2023లో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశాలలో అమెరికా (26,854 బిలినియన్ డాలర్లు) మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత రెండవ స్థానంలో చైనా, మూడవ స్థానంలో జపాన్, నాల్గవ స్థానంలో జర్మనీ, ఐదవ స్థానంలో ఇండియా (3750 బిలినియన్ డాలర్లు) ఉన్నది. 2027- 28లో ప్రపంచంలో అతిపెద్ద 3వ ఆర్థిక వ్యవస్థగా ఇండియా మారుతున్నది. 2047 నాటికి 5 లక్షల కోట్ల డాలర్లకు చేరి వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు వేస్తున్నది. ఐక్యరాజ్య సమితిలో 193 దేశాలకు సభ్యత్వం ఉన్నా 5 దేశాలకు మాత్రమే భద్రత మండలిలో శాశ్వత సభ్యత్వంతో వీటో అధికారాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచంలో జనాభాలో మొదటి స్థానంలో (50% యువ జనాభా) కలిగి, విస్తీర్ణంలో 7వ స్థానంలో 2021 లెక్కల ప్రకారం అక్షరాస్యత 74.04%ను, ప్రస్తుతం 80%పైగా కలిగి ఉన్న భారత దేశం యుద్ధాలు ముఖ్యం కాదు మనుషుల ప్రాణాలు ముఖ్యమని మన ప్రధాన మంత్రి ప్రపంచ శాంతి కోసం పిలుపునిచ్చిన మన సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యమైన భారత్‌కు భద్రత మండలిలో శాశ్వత సభ్యత్వాన్ని కల్పించాలని గట్టిగా వినిపిస్తున్నారు. గత దశాబ్ద కాలంగా భారత్ దౌత్యసంబంధాలు మరో మైలురాయికి చేరిన ప్రస్తుత తరుణంలో ఐక్య రాజ్యసమితి సమితిలో భారత్ కు శాశ్వత సభ్యత్వం కల్పించాలని 99% దేశాలు తమ వాణిని వినిపిస్తున్నాయి. ఇటీవల భారత దేశ మారక ద్రవ్య నిల్వలు పెరుగుతూ భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయి. జాతీయ కరెన్సీని స్థిరీకరించడానికి అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చెయ్యడానికి విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఉపయోగపడతాయి. 1951లో భారత దేశ మారక ద్రవ్యనిల్వలు 2.16 మిలియన్ డాలర్లు మాత్రమే. ప్రపంచంలో ప్రస్తుతం చైనా మొదటి స్థానం (33,16,400 మిలియన్ అమెరికన్ డాలర్లతో)లో, జపాన్ రెండవ స్థానం (12,35,700 మిలియన్ అమెరికన్ డాలర్లతో)లో స్విట్జర్లాండ్ మూడవ స్థానం (802.438 మిలియన్ అమెరికన్ డాలర్లతో) లో భారత దేశం నాల్గవ స్థానం (704.885 మిలియన్ అమెరికన్ డాలర్లతో)లో ఉన్నది.2047 నాటికి ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకులను తట్టుకొని స్థిరత్వాన్ని నిర్ధారించడానికి బలమైన విదేశీ మారక ద్రవ్యనిల్వలు పెంచుకొని వికసిత్ భారత్ వైపు పరుగులు తీస్తున్నది. రక్షణ వ్యయంలో అమెరికా, చైనా, రష్యాలో తరువాత భారత్ నాల్గవ స్థానంలో ఉన్నది. మొదటి స్థానంలో అమెరికా 91,600 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తుండగా, భారత్ 8,360 కోట్ల డాలర్లు ఖర్చు చేస్తూ యుద్ధ ఆయుధాలను అగ్రదేశాలకే ఎగుమతి చేస్తూ తనను తాను రక్షించుకొంటూ అమెరికా, రష్యా, ఫ్రాన్స్, యుకె, చైనాల తరువాత అణ్వాయుధాలను కలిగి 144 కోట్ల జనాభాకు రక్షణ కలిపిస్తున్నది. భారత రక్షణ తన ప్రజల రక్షణ అంటూ సాంకేతికతను అక్కున చేర్చుకున్నది. ప్రణాళికలు ప్రవేశపెట్టి ముస్తఫా కేమాల్ పాషా ఆధ్వర్యంలో టర్కీలో జరిగిన అభివృద్ధి, రష్యాలో లెనిన్, స్టాలిన్, జపాన్ లో ముత్యు హిటో అభివృద్ధిని చూశాం. భారత్‌లో పంచవర్ష ప్రణాళికలు ఆ తరువాత నీతిఆయోగ్ ద్వారా జరుగుతున్న అభివృద్ధినీ చూస్తున్నాం. వికసిత్ భారత్ 2047కు ఇంకా 23సంవత్సరాల దూరంలో అభివృద్ధి చెందిన దేశంగా చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. భారత్ అలీనదేశాల కూటమిలో , బ్రిక్స్, జి20, క్వాడ్ కూటమిలలో ఉంటూనే వేగంగా అభివృద్ధి చెందుతూ వర్ధమాన దేశాలకు ఒక దిక్సూచిగా ఉన్నది. గ్లోబల్ నార్త్‌లో (ప్రథమ ప్రపంచ దేశాలుగా పిలువబడిన అమెరికా, పశ్చిమ ఐరోపా దేశాలు, జపాన్) దేశాలు ఉన్నాయి. గ్లోబల్ సౌత్‌లో (ఆఫ్రికా, లాటిన్ అమెరికాతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్, బ్రెజిల్, చైనా, దక్షిణ ఆఫ్రికా) దేశాలు ఉన్నాయి. భారత్ గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహిస్తూనే గ్లోబల్ నార్త్‌కు 2047 ధ్యేయంగా వికసిత్ భారత్ వైపు పయనిస్తున్నది. భారత్ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం కావడం, నిపుణ మానవ సిబ్బందితో మేక్ ఇన్ ఇండియా లక్ష్యంగా శీఘ్రప్రగతిని సాధించడం భారత్‌కు కలిసివచ్చే అవకాశం. ఆరోగ్య రంగంలో అనేక ఆవిష్కరణలు చేస్తూ కరోనా సంక్షోభ సమయంలో వ్యాక్సిన్‌కు, వైద్య మెడిసిన్స్ అగ్రరాజ్యాలకు అందించి ప్రపంచంలోని పేదదేశాలకు సహాయాన్ని అందించిన భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ఆయుష్మాన్ భారత్ ద్వారా భారత ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్నది. ఒక దేశ ఆరోగ్యమే దాని శ్రేయస్సుకు పునాది, ఆరోగ్యకరమైన జనాభా దేశవృద్ధికి, ఉత్పాదకతకు ఆవిష్కరణకు తోడ్పడుతున్నది. నోవా స్పేస్ నివేదిక ప్రకారం 2014 -24 మధ్యలో అంతరిక్ష పరిశోధనలకు ఇండియా 1300 కోట్ల డాలర్లను ఖర్చు చేయగా, తత్ఫలితంగా 6000 కోట్ల డాలర్ల సంపద సమకూరింది. ఇస్రో అసమాన ప్రతిభ చూపుతూ 129 వ్యోమనౌకలను ప్రయోగించి అమెరికా, కెనడా, యుకె, దక్షణ కొరియా, జపాన్‌లతో పాటు పలు దేశాలకు చెందిన 432 పైగా ఉపగ్రహాలను నీలాల నింగిలోకి పంపింది. చంద్రుడిపైకి ఉపగ్రహాన్ని పంపడమే కాకుండా, సూర్యుడుపై పరిశోధన చేస్తూనే శుక్రయాన్, గగన్‌యాన్, చంద్రయాన్ -4 కు సిద్ధమై స్పేస్‌డాక్‌లో 4వ స్థానంలో చరిత్ర సృష్టించింది. విపత్తుల సమయాలలో వివిధ దేశాలకు సహాయని అందిస్తూ పొరుగు దేశాలను ఆదుకుంటున్నది.సమాజంలోని ఏ వర్గం అభివృద్ధికి దూరంగా కాకూడదని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి, ఉపాధి కల్పనకు, మహిళా సాధికారతకు, విజ్ఞాన వికాసం తదితర అంశాలకు ప్రాధాన్యత ఇస్తూ సబ్ కా వికాసం సహకారం చేసుకునేలా వికసిత్ భారతవైపు ప్రయాణించడానికి శాయశక్తుల కృషి చేస్తున్నది. వికసిత్ భారతానికి విశిష్ట లక్షణాలు కలిగి భవిషత్తరాలు తమ అవసరాలు తీర్చుకునే సామర్థ్యాన్ని దెబ్బతీయకుండా ప్రస్తుత తరాలు తమ అవసరాలను తీర్చుకుంటూ సుస్థిరాభివృద్ధి సాధించి పారిశ్రామిక, ఆర్థిక, ఇతర రంగాలలో భారత్ భవిష్యత్‌లో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా, 2047 నాటికి వికసిత్ భారత్‌గా ఆవిష్కరణ అవుతున్నది.

# బీఆర్ఎస్ పాతుకుపోయే పార్టీ




తెలంగాణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్. ఆ లక్ష్యానికి అనుగుణంగా కేసీఆర్ నాయకత్వంలో పద్నాలుగేండ్ల పాటు ఉద్యమం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. గెలుపోటములు రాజకీయాల్లో సహజమే అయినా, 'తెలంగాణ ఫస్ట్' అనే మాటను శాశ్వతం చేయడమే కేసీఆర్ లక్ష్యం. ఈ లక్ష్యంతోనే టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా మారి, కొత్త దిశలో పయనిస్తున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చవిచూసినప్పటికీ, ఆ ఓటమి పార్టీ బలహీనత వల్ల కాదు. కొన్ని రాజకీయ సమీకరణాలు, ప్రజల్లోకి వెళ్లని నిజాలు, కొన్ని వ్యూహాత్మక లోపాల కారణంగానే బీఆర్ఎస్ తాత్కాలికంగా అధికారం కోల్పోయింది కానీ, శాశ్వతంగా కాదనే మాటను గుర్తుంచుకోవాలి. గెలిస్తే తలెత్తుకొని, ఓడిపోతే తలదించుకునే పార్టీ బీఆర్ఎస్ కాదు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు వేరు తెలంగాణలోని బీఆర్ఎస్ వేరు. దాదాపుగా రాష్ట్రంలోని 40 వేల పోలింగ్ బూత్‌లలో 4.5 లక్షల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు పనిచేశారు. అంటే ఆ పార్టీ 100-50 ఓట్లకు ఒక కార్యకర్త చొప్పున వ్యవస్థీకృతమైన రాజకీయ శక్తిని కలిగి ఉన్నది. పార్టీ సభ్యత్వం 60 లక్షల పైచిలుకు ఉన్నది. దాదాపు 20 లక్షల క్రియాశీలక సభ్యులున్న బీఆర్ఎస్ ఆర్థిక పరిపుష్టి కలిగి, బలమైన క్యాడర్‌తో నిండి ఉన్నది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు ఉన్నాయి. దేశ రాజధానిలో పార్టీ కార్యాలయం కలిగి ఉన్న ఏకైక ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్. మహారాష్ట్రలోని పుణె, నాందేడ్ లాంటి ప్రాంతాలకూ బీఆర్ఎస్ పార్టీ కార్యకలాపాలు విస్తరించాయి. ఒకే ఒక్కడితో ప్రారంభమైన పార్టీ, నేడు కొన్ని లక్షల మంది కార్యకర్తలతో ముందుకు సాగుతున్నది. 2018లో బీఆర్ఎస్ దాదాపు కోటి ఓట్లను సాధించింది. 20 23లో 4 లక్షల ఓట్ల తేడాతో అధికారాన్ని కోల్పోయింది. ఇది తాత్కాలికంగా మారిన ఓటింగ్ సరళి మాత్రమే. కానీ, బీఆర్ఎస్ క్యాడర్‌ను దెబ్బతీసే స్థాయి ఓటమి రాలేదనే విషయాన్ని కాంగ్రెస్, బీజేపీ గుర్తుంచుకోవాలి. కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ అభివృద్ధికి చేసిన సేవలు, అమలుచేసిన సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ శక్తిసామర్థ్యాలను నిరూపించాయి. బీఆర్ఎస్ కార్యాలయ ఇంఛార్జిగా రిటైర్డ్ ప్రొఫెసర్ మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిని నియమించడం, ఒక ఉద్యమ నాయకుడిని పార్టీ నిర్వహణకు తీసుకురావడం బీఆర్ఎస్ పాలనాకౌశల్యాన్ని తెలుపుతున్నది. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ కేసీఆర్ అభివృద్ధి పరంగా దూసుకువెళ్లారు. ఆ చాకచక్యమే పార్టీకి సమయాన్ని, వ్యవస్థీకృతంగా ముందుకువెళ్లే అవకాశాన్నిస్తున్నది. కేసీఆర్ గత పదేండ్లుగా ప్రభుత్వ, పార్టీ నిర్వహణను సమతుల్యం చేశారు. కానీ, ఇప్పుడు అధికారంలో లేకపోవడం కారణంగా ఆయన పూర్తి సమయాన్ని పార్టీకే కేటాయిస్తారు. తద్వారా కార్యకర్తలకు శిక్షణ, నాయకత్వ మార్గదర్శనం మరింత బలంగా కొనసాగుతుంది. ఆ దిశగానే అనుభవం కలిగిన నాయకుడిగా, తన యాభై ఏండ్ల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న వ్యూహకర్తగా కేసీఆర్, పార్టీని మరింత పటిష్ఠం చేసేందుకు కంకణం కట్టుకున్నారు. అందులో భాగంగానే గత ఏడాదిన్నర కాలంగా దాదాపు ఒక లక్ష మందికి పైగా కార్యకర్తలను ప్రత్యక్షంగా కలిశారు. పార్టీ నేతలను, కార్యకర్తలను ఒకే తాటిమీదికి తేవడంలో ఆయన విజయవంతంగా ముందుకుసాగుతున్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మరోసారి తెలంగాణ గడ్డమీద తన బలాన్ని నిరూపించుకోబోతున్నది. ఓటమి అనేది పార్టీ అంతం కాదు, అది మరింత బలంగా తిరిగి రావడానికి అవకాశం. ప్రజా సంక్షేమ పరమావధిగా ముందుకువెళ్లే బీఆర్ఎస్ పార్టీ నిలబడటమే కాదు, మరింత పాతుకుపోతుందనడంలో ఏ మాత్రం సంశయం అక్కరలేదు.